జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 12 సంచిక 148 విశాఖపట్నం | గురువారం 11 ఫిబ్రవరి 2021 | 8 పేజీలు | వెల : 5.00

# కాంగ్రెస్ అయోమయంలో ఉంది

## ప్రధాని నరేంద్ర మోదీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ప్రజాపాలన) :** కాంగ్రెస్ పార్టీలో వైరుధ్యాలతో పాటు అయోమయం నెలకొందని, తమ మేలు కోసం తాము చేసుకోవడం కానీ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆలోచించడం కానీ చేయడం లేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇంతకంటే దురదృష్టం ఏముంటుందని పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో ప్రధాని బుధవారంనాడు మాట్లాడుతూ, వాదనలు అనేవి అనేక రకాలుగా ఉంటాయని, మేము అడగనప్పుడు మీరెందుకు అలా చేశారని అంటుంటారని, నిజానికి అంగీకరించడం, అంగీకరించకపోవడం అనేవి వారి వారి ఇష్టాలపై ఉంటుందని, బలవంతం ఉండదని అన్నారు. ఇందుకు ఉదాహరణలు చెబుతూ...'కట్నం తీసుకోకుండా చట్టం చేయమని ఎవరూ డిమాండ్ చేయలేదు. అయితే దేశ ప్రగతిని దృష్టిలో ఉంచుకునే చట్టం తెచ్చారు. ట్రిపుల్ తలాఖ్‌కు వ్యతిరేకంగా మేము చట్టం చేశాం. అలాగే బాల్యవివాహాల వ్యతిరేక చట్టం కూడా ప్రగతి కారక చట్టమే' అని మోదీ వివరించారు.

### చిన్న రైతుల కోసం ఎవరు అడిగారు?

చిన్న రైతులకు అండగా కొంత డబ్బు జమ చేయాలని ఏ రైతు సంస్థ డిమాండ్ చేయలేదని, అయితే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద తాము రైతులకు సాయం ఇస్తున్నామని మోదీ అన్నారు. రైతు చట్టాలను ఆర్డినెన్స్ ద్వారా ఆమోదించి, ఆ తర్వాత పార్లమెంటు ఆమోదం పొందామని చెప్పారు. చట్టాల అమలు తర్వాత కూడా ఏ ఒక్క మండీ మూతపడలేదని, దేశంలో ఎక్కడా కనీస మద్దతు ధర ఆగిపోలేదని పేర్కొన్నారు. ఇది పూర్తిగా నిజం, ఇందులో దాపరకమంటూ ఏదీ లేదని అన్నారు. చట్టాలు చేసిన తర్వాత కూడా కొనుగోళ్లపై ఎంఎస్‌పీ పెరిగిందని అన్నారు. సాగు బిల్లులపై అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న రైతుల పట్ల లోక్‌సభతో పాటు, తమ ప్రభుత్వానికి కూడా ఎంతో గౌరవం ఉందని అన్నారు. ఆ కారణంగానే సీనియర్ మంత్రులు నిరంతరం రైతులతో మాట్లాడుతున్నారని సభకు తెలిపారు. రైతులంటే తమకెంతో గౌరవమని మరోసారి స్పష్టం చేశారు. ఆర్డినెన్స్ చేసిన తర్వాత కానీ, పార్లమెంటులో బిల్లులు ఆమోదించిన తర్వాత కానీ ఎక్కడా కనీస మద్దతు ధరను కానీ, మండీలను కానీ ఆపిన దాఖలాలే లేవని ప్రధాని అన్నారు.

### ప్రైవేటు రంగం కూడా కీలకమే...

ప్రభుత్వ రంగం అవసరం ఉందని, ఇదే సమయంలో ప్రైవేటు రంగం పాత్ర కూడా కీలకమని ప్రధాని మోదీ అన్నారు. టెలికాం, ఫార్మా సహా ఏ రంగం తీసుకున్నా ప్రైవేటు రంగం మిగతా 2లో..

# పక్కదారి పట్టొద్దు

## వాలంటీర్లకు బొత్స సత్యనారాయణ హితవు



**తాడేపల్లిగూడెం, ప్రజాపాలన :** తొలిదశలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 82 శాతానికి పైగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. తొలిదశలో జరిగిన ఎన్నికల్లో 2,637 పంచాయతీల్లో తమ పార్టీ మద్దతుదారులు గెలుపొందారని వివరించారు. తమ మద్దతుదారులను గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై బుధవారం తాడేపల్లిగూడెంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తీరుపై మండిపడ్డారు. చంద్రబాబు నోరు విప్పితే అబద్ధాలేనని మంత్రి బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు చెప్పింది అంకెల గారడీ నేనని పేర్కొన్నారు. కిందపడినా.. పైనే ఉన్నట్లు చంద్ర బాబు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చా మని తెలిపారు. కొన్ని దుష్టశక్తులు వాలంటీర్ వ్యవస్థకు తూట్లు పొడవా లని చూస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. సేవా దృక్పథంతో పనిచేసే వారికి రూ.5 వేలు గౌరవ వేతనం ఇస్తామని ముందే చెప్పా మని గుర్తుచేశారు. ప్రతి ఇంటికి మేలు చేయాలనే ఉద్దేశంతోనే వాలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చినట్లు తెలిపారు. సమాజంలో వాలంటీ ర్లకు మంచి గౌరవం ఉందని దాన్ని పాడుచేసుకోవద్దని సూచించారు. ఎవరో చెప్పిన మాటల్ని విని.. పక్కదారి పట్టొద్దని వాలంటీర్లకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

# విశాఖ ఉక్కు.. కేంద్రమంత్రి కీలక సమాధానం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11 (ప్రజాపాలన) :** విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో రాజ్యసభలో కేంద్ర ఉక్కుశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక సమాధానం ఇచ్చారు. విశాఖ ఉక్కు కర్మాగారం స్థలంలో ప్లాంట్ ఏర్పాటుకు దక్షిణ కొరియాకు చెందిన సంస్థ ఆసక్తి చూపిస్తున్నట్లు తెలిపారు. రాజ్యసభలో వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు దక్షిణ కొరియాకు చెందిన పోస్కో స్టీల్ ఆసక్తి కనబరుస్తోందని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. పోస్కో, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) మధ్య 2019 అక్టోబర్‌లో అవగాహన ఒప్పందం జరిగినట్లు వివరించారు. న్యాయపరంగా ఎలాంటి కట్టుబాట్లు లేని అవగాహన ఒప్పందమని.. వాటాల విషయమై నిర్ధారణకు రాలేదని సమాధానంలో కేంద్రమంత్రి పేర్కొన్నారు.

# నిమ్మగడ్డ ఇబ్బంది పెట్టినా.. భయపడలేదు : సజ్జల



**అమరావతి, ప్రజాపాలన :** అందరు ఊహించినట్లే ప్రజలు వైఎస్సార్‌సీపీకే పట్టంకట్టారని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తొలిదశ పంచాయతి ఎన్నికల్లో 2,637 వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారన్నారు. పచ్చ మీడియా ప్రజలను తప్పుదోవ పట్టించేలా కథనాలు రాస్తున్నా, ప్రజలు అధికారపార్టీ వైపే నిలిచారన్నారు. అందుకు 80 శాతానికి పైగా స్థానాలను వైఎస్సార్‌సీపీ పార్టీ క్లీన్ స్వీప్ చేసిందన్నారు. ప్రతి పక్ష టీడీపీ పార్టీ వెంటిలెటర్‌పై ఉందని, రాజ్యంగ బద్ధ పదవిలో ఉండికూడా నిమ్మగడ్డ టీడీపీ కార్యకర్తలా పని చేస్తున్నాడని సజ్జల విమర్శించారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఎంత ఇబ్బందిపెట్టిన ఎవరు భయపడలేదన్నారు. జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు, కొవిడ్ లాంటి విపత్తును ఎదుర్కొవడంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు కల్పించిన భరోసానే ఎక్కువ స్థానాలు గెలవడానికి కారణమన్నారు. కొన్ని పచ్చ మీడియాలు బ్యానర్‌లో టీడీపీకి అనుకూలంగా రాసినప్పటికి, లోపల మాత్రం 80 శాతం వైఎస్సార్‌సీపీ, 20 శాతం టీడీపీ గెలిచాయని రాశాయన్నారు. వీరి తీరు మేకపోతు గాంభీర్యంలా ఉందన్నారు. దేవినేని ఉమా నియోజక వర్గంలో టీడీపీని ప్రజలునమ్మే స్థితిలో లేరన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాల మిగతా 2లో..

# 18న దేశవ్యాప్తంగా 'రైల్ రోకో'!

## నాలుగు గంటల కార్యక్రమానికి ఎస్‌కేఎం పిలుపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ప్రజాపాలన) :** కేంద్రం తీసుకొచ్చిన కొత్త సాగు చట్టాలను రద్దు చేయాలన్న డిమాండ్‌పై రైతు సంఘాలు తమ పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేశాయి. ఇటీవల జాతీయ/ రాష్ట్ర రహదారుల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన రైతు సంఘాల నేతలు.. తదుపరి ఉద్యమ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 18న దేశవ్యాప్తంగా రైల్‌రోకో కార్యక్రమానికి పిలుపునిచ్చారు. నాలుగు గంటల పాటు దేశవ్యాప్తంగా మిగతా 2లో..



## ఘనంగా స్నేహాసంస్థల చైర్మన్, బహుజనుల శ్రేయోభిలాషి

# డా. కటికల శివ భాగ్యారావు జన్మదిన వేడుకలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ప్రజాపాలన) :** మార్గాన్ని దాటే వాడు సమర్థుడు మార్గాన్ని చూపేవాడు నాయకుడు మంచి మార్గంలో పలువురిని తన వెంట తీసుకెళ్తూ ఆ మార్గానికి వారందరినీ యజమానులు చేసేవాడు ధన్యజీవుడు. పక్షికి రెక్కలు లేకుంటే ఎగరలేదు బహుజనులకు మీడియా లేకుంటే అభివృద్ధి లేదు అంటూ బహుజనుల ఐక్యతకై పలు సంస్థలు స్థాపించి బహుజనులను భాగస్వామ్యులుగా చేస్తూ వారి అభ్యున్నతికి పాటుపడుతున్న నిగర్వి, సుమనస్కులు, వినమ్రశీలి స్నేహా సంస్థల చైర్మన్ కటికల శివ భాగ్యారావు జన్మదిన వేడుకలు స్నేహా సంస్థల కేంద్రకార్యాలయం హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. పే బ్యాక్ టు సొసైటీ అన్న ఉద్దేశ్యంతో "పుస్తకం లేక చదువు ఆగకూడదు"అన్న నినాదంతో తొలుత బహుజన విద్యార్థులకు పుస్తకాల పంపిణీతో మొదలుపెట్టి స్నేహా క్లబ్ ను ప్రారంభించిన కటికల శివ భాగ్యారావు తన అత్యున్నత గవర్నమెంట్ ఉద్యోగం ఐఆర్ఎస్‌కు విఆర్ఎస్ ప్రకటించి బహుజనులకు రాజ్యాధికారమే బహుజనుల అభివృద్ధికి నిజమైన లక్ష్యం అంటూ స్నేహా సంస్థలను నెలకొల్పారు. వికేంద్రీకరణ సూత్రాన్ని ఉపయోగించి తన సంస్థలలో తనతో సహా బహుజనులందరిని



డైరెక్టర్‌లుగా చేర్చుకొని వారిని బాగస్వామ్యులుగా, నియోజకవర్గ యజమానులుగా తీర్చిదిద్దుతూ అంచెలంచెలుగా ఎదుగుతూ స్నేహా సంస్థలకు అనుబంధంగా పలు సంస్థలను స్థాపించి బహుజనుల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. ప్రజాపాలన పత్రిక, స్నేహా చిట్స్, స్నేహామార్క్స్, స్నేహ ఛానల్, మాస్టర్ కీ ఛానల్ మొదలగు అనేక అనుబంధం సంస్థలు ఆయన స్థాపించినవే. బహుజనులకు ఇంత గా సేవ చేస్తున్న ఆయన బహుజను లకు రాజ్యాధికారమే తన లక్ష్యం అని ఎప్పుడూ పునరుద్ఘాటిస్తారు. ఇన్ని సంస్థలకు అధిపతి ఐనా అందరివాడుగా ప్రతీ స్నేహా క్లబ్ మెంబర్‌కి అందుబాటులో ఉండే వినమ్ర శీలి ఆయన అంటూ కటికల శివ భాగ్యారావు జన్మదినోత్సవాన్ని మిగతా 2లో..



## కాంగ్రెస్ అయోమయంలో ఉంది

(మొదటిపేజీ తరువాయి)

కీలక పాత్ర మనకు కనిపి స్తుందని పేర్కొన్నారు. మానవాళికి సేవలు అందించగలుగుతున్నామంటే ప్రైవేటు రంగ పాత్ర కూడా కారణమని అన్నారు.

**విపక్షాల వాకౌట్...**

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ప్రధాని ప్రసంగిస్తూ సాగు చట్టాల ప్రస్తావన తీసుకు వచ్చినప్పుడు విపక్ష ఎంపీలు గందరగోళం సృష్టించారు. అనంతరం, సభ నుంచి విపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు. అంశాల ప్రాధాన్యత దృష్ట్యా ధన్యవాద తీర్మానంపై చర్చకంటే రైతుల ఆందోళనపై తొలుతచర్చ జరపాలని విపక్షాలు మొదట్నించీ పట్టుబడుతున్నాయి.

## నిమ్మగడ్డ ఇబ్బంది పెట్టినా.. భయపడలేదు : సజ్జల

(మొదటిపేజీ తరువాయి)

అమలు ద్వారానే ప్రజలకు చేరువైందని అన్నారు. రానున్న40 రోజులు ఏంచేయాలో తమవద్ద ప్రణాళిక ఉందని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను అడ్డుపెట్టుకుని దిగజారుడు రాజకీయాలు చేయొద్దని టీడీపీకి హితవు పలికారు. వెన్నుపోటుకు పెటెంట్ ఉన్న బాబు, జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు.

## 18న దేశవ్యాప్తంగా 'రైల్ రోకో'!

(మొదటిపేజీ తరువాయి)

రైళ్లను అడ్డుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపునిచ్చింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. అలాగే, ఈ నెల 12 నుంచి రాజస్థాన్‌లోని అన్ని టోల్ ప్లాజాల వద్ద టోల్ కలెక్షన్‌ను కొనసాగనీయబోమని తెలిపింది. కేంద్రం రూపొందించిన మూడు సాగు చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది రైతులు దిల్లీ సరిహద్దుల్లో రెండు నెలలకు పైగా పోరాటం కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

## స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే వ్యతిరేకత బయటపడుతుంది

### టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

**అమరావతి ఫిబ్రవరి 10 (ప్రజాపాలన) :** పంచాయతీ ఎన్నికల్లో టీడీపీకి విజయాన్ని సాధించిపెట్టిన కార్యకర్తలకు, పార్టీ కోసం పోరాడిన యోధులకు శిరసు వంచి నమస్కరిస్తున్నానంటూ ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ట్వీట్ చేశారు. గాలి హామీలిచ్చి అధికారంలోకొచ్చిన ఫేక్ పార్టీకి ఒక్క చాన్స్, చివరి చాన్స్ అని ప్రజలు స్థానిక ఎన్నికల ద్వారా తీర్పునిచ్చారన్నారు. "వైఎస్ జగన్‌రెడ్డి ఇంట్లో పుట్టిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి.. జనం గుండెల్లోంచి పుట్టిన తెలుగుదేశం పార్టీతో పోలికా?" అని ప్రశ్నించారు. స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే జనంలో ఉన్న వ్యతిరేకత బయటపడుతుందని జగన్‌రెడ్డి రాజ్యాంగవ్యవస్థలపై దాడికి తెగబడ్డారని ఆయన ట్వీట్ చేశారు. న్యాయస్థానాల చొరవతో స్థానిక ఎన్నికలు జరిగాయన్నారు. "అధికారయంత్రాంగం, పోలీసుల్ని వాడుకుని వైసీపీ వాళ్లు హత్యలు చేశారు, కిడ్నాప్‌లకు పాల్పడ్డారు, నామినేషన్ పత్రాలు చించేశారు, ఆస్తులు తగులబెట్టారు, ప్రలోభాలతో ఏకగ్రీవాలు చేసుకున్నారు. ఇన్ని చేసినా ఎదురొడ్డి నిలిచి గెలిచారు తెలుగుదేశం యోధులకు, కార్యకర్తలు అని లోకేశ్ పేర్కొన్నారు.

## కడెం ప్రాజెక్టును సందర్శించిన భట్టి నేతృత్వంలోని సీఎల్పీ బృందం

**కడెం ఫిబ్రవరి 10 (ప్రజాపాలన) :** రైతులతో ముఖాముఖీ కార్యక్రమంలో భాగంగా కడంలో పర్యటించిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క బృందం. అందులో భాగంగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో నిర్మించిన కడెం ప్రాజెక్టును పరిశీలించిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## తాళ్లూరులో ఉప సర్పంచ్ పై దాడి

**విజయవాడ ఫిబ్రవరి 10 (ప్రజాపాలన):** కృష్ణాజిల్లా వత్సవాయి మండలం తాళ్లూరు గ్రామంలో సర్పంచి అభ్యర్థిగా టిడిపి పార్టీ బలపరిచిన వారు గెలవడంతో ఉప సర్పంచ్ అయిన సాహెబ్ మౌలా ఇంటిపై రాళ్లతో దాడి చేసి చంపుతానని బెదిరించడంతో ప్రాణభయంతో ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. ఎంతకీ తలుపు తీయకపోవడంతో ఓటమి చెందిన అభ్యర్థులు బయట ఉన్న అతని ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేసారు.

## పల్లా ఆమరణ నిరాహార దీక్షలు

**విశాఖపపట్నం ఫిబ్రవరి 10 (ప్రజాపాలన) :** విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదం తో విశాఖ జిల్లా టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావు ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టానని అన్నారు. గాజువాక పార్టీ ఆఫీస్ వద్ద చేపట్టిన దీక్షలలో భాగంగా ఆయన ఈ ప్రకటన చేశారు. ప్రభుత్వరంగ స్టీల్ ప్లాంట్ ను సాధించుకునే వరకు దీక్షను విరమించేది లేదని ఆయన తెలిపారు. పల్లా శ్రీను దీక్షకు టీడీపీ సీనియర్ నాయకులు బుద్ధ వెంకన్న, దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, భరత్ కుమార్, సంఘీభావం తెలియజేస్తూ ప్రశాంగించారు. ఈ కార్యక్రమం లో మాజీ వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థులు పల్లా శ్రీనివాస్, గంధం శ్రీను, మహమ్మద్ రఫీ, స్టీల్ ప్లాంట్ యూనియన్ నాయకులు విల్లా రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంట్లో వాళ్ళకే జగన్ వెన్నుపోటు పొడిచారు: చంద్రబాబు

**అమరావతి ఫిబ్రవరి 10 (ప్రజాపాలన) :** వైఎస్ షర్మిల పార్టీ ఏర్పాటు చేస్తున్నారన్న వార్తలపై టీడీపీ అధినేత చంద్రబాబు స్పందించారు. పార్టీ పెడుతున్నానని షర్మిల చెబుతుంటే.. ఏ2 మాత్రం లేదంటున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. మీడియాతో బుధవారం మాట్లాడుతూ..ఇంట్లో వాళ్ళకే జగన్ వెన్నుపోటు పొడిచారని ఎద్దేవా చేశారు. బాబాయ్ హత్య ఇంకా తేల్చ లేదని విమర్శించారు. విజయసాయి రెడ్డి వ్యాఖ్యలకు సంబంధించిన ఓ వీడియో ప్లే చేశారు. ఆనాడు జగనన్న వదిలిన బాణం విశ్వసనీయత ఏమైందన్నారు. విశ్వసనీయత గురించి మాట్లాడే జగన్.. షర్మిల పార్టీ పెట్టడంపై స్పందించాలన్నారు. అప్పుడు సీబీఐ కావాలని డిమాండ్ చేసిన జగన్.. ఇప్పుడు వద్దు అంటున్నారన్నారు. బాబాయ్‌ని చంపిన వారితో కలిసిన వ్యక్తి జగన్ అని ఆరోపించారు. నాడు వివేకా కూతురు... నేడు షర్మిల పోరాడుతున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## ఘనంగా స్నేహసంస్థల చైర్మన్, బహుజనుల శ్రేయోభిలాషి

# డా.కటికల శివ భాగ్యారావు జన్మదిన వేడుకలు



(మొదటిపేజీ తరువాయి)

ఒక పండుగలా స్నేహ క్లబ్ సభ్యులు, డైరెక్టర్‌లు, స్నేహ సంస్థల సిబ్బంది జరుపుకోవడం విశే షం. ఈ కార్యక్రమంలో స్నేహ సంస్థల డైరెక్టర్ ఆరేపల్లి రాజేం దర్ మాట్లాడుతూ ఐ ఆర్ ఎస్ లాంటి దేశంలో అత్యున్నతమైన ఉద్యోగానికి విఆర్‌ఎస్ ఇచ్చి బహుజనుల ఐక్యతకై, అభివృద్ధికై పలు సంస్థలను స్థాపించి బహుజనులను యజమానులుగా చూడాలన్న తలంపుతో స్నేహ సంస్థలను స్థాపించిన శివ భాగ్యారావు ధన్య జీవులు అన్నారు. 26న తెలంగాణలో నిర్వహించే మాక్ అసెంబ్లీని విజయవంతం చేయడంలో అందరూ శివ భాగ్యారావుకి సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. స్నేహ సం స్థల డైరెక్టర్,తెలంగాణ సమాజ్ వాది పార్టీ కన్వీనర్ భీంరావు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో బహుజనులందరికి దిశానిర్దేశం చేసేలా శివ భాగ్యా రావు పాటుపడుతున్నారన్నారు. మాస్టర్ కీ (అంబేద్కర్)ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ జె బి రాజు మాట్లాడుతూ బహుజనులను ధనికులుగా చేయాలన్న తలంపుతో నిరంతర శ్రామికునిగా రోజుకు 18 గంటలు శ్రమిస్తున్న శివ భాగ్యారావు ఆశయాలు సిద్ధించాలన్నారు. ఆయన లక్ష్యం బహుజనులకు రాజ్యాధికారం సాకారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్నేహ సంస్థల డైరెక్టర్ శ్యామ్ సుందర్ మాట్లాడుతూ స్నేహ క్లబ్ ప్రారంభంలో శివ భాగ్యారావుని వీడిన వారు మళ్ళీ ఆయన బహుజనుల ఐక్యతకు, అభివృద్ధికి దృఢసంకల్పంతో బహుజనులకు రాజ్యాధికారం దక్కాలనే యజ్ఞములో ఆయన వెంట నడుస్తున్నారన్నారు. చివరగా మాట్లాడిన స్నేహ సంస్థల చైర్మన్ కటికల శివ భాగ్యారావు తన పుట్టిన రోజును ఇలా బహుజనుల వేడుకగా చేసిన ఆరేపల్లి రాజేందర్, భీం రావ్, వెంకటేశ్వర్లు తదితరులందరు డైరెక్టర్లకి ధన్యవాదాలు తెలిపారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు జైభీములు తెలియజేసారు. తన వయసు గురించి ఛలోక్తి విసిరిన మాస్టర్ కీ టీవీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జె.బి.రాజు కు సమాధానంగా తను ఎప్పుడైతే పనిచేయడం మానేస్తానో అప్పుడే నా వయసు ఒకటిగా లెక్కవేసుకోవచ్చని సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు స్నేహ సంస్థల డైరెక్టర్లు రాచమల్ల శ్యామ్ సుందర్,డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు, డాక్టర్. ఓ. నాగేశ్వరరావు, నేరెళ్ల కోటేశ్వర రావు, ఎస్.రామకృష్ణ, జి.కెన్నిబాబు,ఆరేపల్లి రాజేందర్, డి.దేవదాసు, నేరేళ్ల సత్యనారాయణ, కుసుమ భోగరాజు,పర్లపల్లి నారాయణ తో పాటు పలువురు మాస్టర్ కీ ఛానల్ డైరెక్టర్లు పూల బొకేలతో శుభాకాంక్షలు తెలిపారు. పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు.



## నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

**వెంకటగిరి ఫిబ్రవరి 10 (ప్రజాపాలన) :** నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్ ఆదేశాల మేరకు మండలంలోని నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్థానిక ఎస్.ఐ కోటిరెడ్డి అన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద గుంపులుగా వుండరాదన్నారు. అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన వారికి పార్టీలకతీతంగా వరుస క్రమంలో టోకెన్ లు ఇచ్చి నామినేషన్ పత్రాలను పరిశీలించిన తరువాతరిటర్నింగ్ అధికారి వద్దకు పంపేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

## వద్దన్నా గెలిచేసింది?

**నరసాపురం ఫిబ్రవరి 10 (ప్రజాపాలన) :** అదృష్టం కలిసి వస్తే మనం ఎక్కడ ఉన్నా అదృష్టం తలుపు తట్టింది నిన్న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం చిట్టవరం గ్రామానికి చెందిన కృష్ణవేణి అనే మహిళకు వై ఎస్ ఆర్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ పదవి దక్కింది. రాజకీయాల్లోకి రాను అని మొరపెట్టుకున్న కేవలం డమ్మీ క్యాండెట్ గా నామినేషన్ వేయించారు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకపోయినా అభ్యర్థి పై వార్డు ప్రజలు ఈ ఓటేసి గెలిపించారు ఈమెకు వైస్ ప్రెసిడెంట్ పదవి దక్కింది అదృష్టం కలిసి వస్తే ఇలాగే ఉంటుందేమో.

# కటికల కాంతమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత పుస్తకశాలను ఏర్పాటు





**బాపట్ల, ప్రజాపాలన :** కటికల కాం తమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో కటికల శివ భాగ్య రావు జన్మదినం పురస్కరించుకొని బాపట్లలోని ప్రతి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హాస్టల్ లో, ప్రతి పేద విద్యార్థిని ,విద్యా ర్థులకు ప్రతి సంవత్సరం ఉచితం గా పుస్తకాలు పంపిణీ చేసేవారు అయితే ఈ సంవత్సరం ప్రతి ఎస్సి ఎస్టి మైనారిటీ హాస్టల్ లో పుస్తక శాల ను ఏర్పాటు చేసి విద్యార్థిని విద్యా ర్థులకు అవసరమైన పుస్తకా లను లైబ్రరీ లో పొందుపరిచారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయా లతో ఏ విద్యార్థి ఏ విద్యార్థిని చదువు పుస్తకాలు లేక ఆగిపోకూడదు అనే నినాదంతో మనవంతు మనం సమాజానికి ఏదైనా మేలు చేయా లి ప్రతి పేదవిద్యార్థికి ఉపయోగ పడాలి పేదలకు బడుగు బలహీన వర్గాలకు వారి చదువు పుస్తకాలు లేక బట్ట లేఖ చదువు ఆగిపోకూడ దు అని సదుద్దేశంతో ఈ సంవత్స రం కటికల శివ భాగ్య రావు పుట్టి నరోజును బాపట్లలో పేద విద్యా ర్థుల మధ్య, సాల్వేషన్ ఆర్మీ, విలి యం బూత్, ఎస్సీ ఎస్టీ హాస్టల్లో, అంబేద్కర్ టీవీ డైరెక్టర్ గురుజాల శ్రీనివాస్ మరియు స్నేహ క్లబ్ ప్రెసిడెంట్ కాగిత సుందరదాసు, స్నేహా క్లబ్ గవర్నర్ కాగిత వరప్ర సాద్ సిబ్బంది మహేష్ మోహన్, పొన్నూరు స్నేహ క్లబ్ ప్రకాష్ మరియు సిబ్బంది రవి తదిత రులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్నేహ గ్రూప్ ఆఫ్ ఆర్గనై జేషన్ అధినేత అయినటువంటి శివభా గ్యరావు పుట్టినరోజును ఘనంగా జరిపారు.

# ఏపిఎస్ఎస్‌డిసికి జీనియస్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ గుర్తింపు



- కోవిడ్ సమయంలో యువతకు ఆన్ లైన్ ద్వారా నైపుణ్య శిక్షణ, ఉపాధికల్పనకు ఈ గుర్తింపు
- హర్షం వ్యక్తం చేసిన ఎపిఎస్ఎస్‌డిసి చైర్మన్ చల్లా మధుసూదన్ రెడ్డి
- ఎపిఎస్ఎస్‌డిసి సిబ్బంది సమక్షంలో మెమెంటో, సర్టిఫికెట్ అందజేత

**అమరావతి, ప్రజాపాలన :** కోవిడ్ సమయంలోనూ విద్యార్థులు, నిరు ద్యోగ యువతకు లబ్ధికలిగేలా నైపు ణ్య శిక్షణా కార్యక్రమాలను ఆన్ లైన్ వర్చువల్ ద్వారా నిర్వహించి నందుకు గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్ డిసి)కు జీనియస్ ఇంటర్నేషన్ బుక్ ఆఫ్ రికార్డు సంస్థ గుర్తింపు రావడం సంతోషంగా ఉందని ఆ సంస్థ చైర్మన్ చల్లా మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం తాడేపల్లిలోని సంస్థ కార్యలయంలో ఎపిఎస్ఎస్ డిసి చైర్మన్ చల్లా మధుసూదన్ రెడ్డి, ఎండి సీఈవో డాక్టర్ అర్జా శ్రీకాంత్ లకు జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు మెమెంటోను ఆ సంస్థ సౌత్ ఇండియా , ఏపీ కోఆర్డినేటర్ రాజా రమేష్, నేషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ విజయ రాఘవ అందజేశా రు. ఈ సందర్భంగా ఎపిఎస్ఎస్‌డిసి చైర్మన్ చల్లా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... కోవిడ్ మహమ్మారి వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర ప్రభు త్వం లాక్డౌన్ ప్రకటించిన నేపథ్యం లో అందరూ ఇంటికే పరిమతం అయ్యారన్నారు. అలాంటి పరిస్థితు ల్లో ఎపిఎస్ఎస్‌డిసి ద్వారా విద్యార్థు లు, నిరుద్యోగ యువతకు ఆన్ లైన్ ద్వారా మార్కెట్ లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో నిపుణులతో శిక్షణ ఇచ్చే లా కార్యాచరణ రూపొందించామ న్నారు. కోవిడ్ సమయంలో విద్యా ర్థులు, నిరుద్యోగ యువత, మహిళ లతో కలిపి సుమారు 1,99,356 మంది లబ్ధి పొందారన్నారు. ఈ ఆన్‌లైన్ శిక్షణలో భాగంగా అధ్యా పకులకు ఇండస్ట్రీ 4.0 స్కిల్స్, ఐబి ఎం స్కిల్ బిల్ట్, ఈ లెర్న్ ఓక్, ఫైనా న్సియల్ మార్కెటింగ్ తోపాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వివిధ కోర్సులపై నిపుణులతో శిక్షణ ఇవ్వ డాన్ని జీనియస్ ఇంటర్నేషన్ బుక్ ఆఫ్ రికార్డు సంస్థ గుర్తించడం సం తోషంగా ఉందన్నారు. అనంతరం ఎపిఎస్ఎస్‌డిసి ఎండి సీఈవో డాక్టర్ అర్జా శ్రీకాంత్ మాట్లాడు తూ.. కోవిడ్ సమయంలో ఇళ్లలోనే ఉండే యువతకు ఆధునిక టెక్నాల జీల్లో నైపుణ్య శిక్షణ ఇస్తే బాగుం టుందని ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమ చంద్రారెడ్డి, ఎపిఎస్ ఎస్‌డిసి చైర్మన్ చల్లా మధుసూదన్ రెడ్డి సూచించారని.. వారి ఆలోచన లకు కార్యరూపం ఇచ్చి 1,99,356 మందికి ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వగలిగా మన్నారు. తమ సంస్థ చేపట్టిన ఈ నైపుణ్య శిక్షణా కార్యక్రమాలకు జీనియస్ ఇంటర్నేషన్ బుక్ ఆఫ్ రికార్డు గుర్తింపు రావడం సంతోషం గా ఉందన్నారు. జీనియస్ ఇంటర్నే షన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ సౌతిం డియా కోఆర్డినేటర్ రాజా రమేష్ మాట్లాడుతూ... కోవిడ్ సమయంలో ఇంతపెద్ద స్థాయిలో ఆన్ లైన్ ద్వారా నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను ఎక్కడా నిర్వహించలేదన్నారు. కేవలం నైపుణ్య శిక్షణ ఇవ్వడమే కాకుండా ఉద్యోగ, ఉపాధి అవకా శాలు కల్పించడంలోనూ ఎపిఎస్ ఎస్‌డిసి మంచి ఫలితాలు సాధిం చిందన్నారు. వీటన్నింటినీ పరిశీలిం చిన తర్వాతే జీనియస్ ఇంటర్నేషన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు ఎంపిక చేశామ న్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎస్ఎస్‌డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు వి. హనుమ నాయక్, డాక్టర్ డి.వి. రామకోటిరెడ్డితోపాటు జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు మెమెం టోను సంస్థ నేషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ విజయ రాఘవ, డాక్టర్ జె.వి.సోమయాజులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్దే ధ్యేయంగా పని చేయండి

**- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్**

**నందికొట్కూరు ఫిబ్రవరి 10 (ప్రజా పాలన) :** కొత్తపల్లె మండలం పెద్ద గుమ్మడా పురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ తెలుగు మల్ల య్య సుమారు 100 మంది అనుచ రులతో బుధవారం వైస్సార్సీపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్థర్ మా ట్లాడుతూ గ్రామాల్లో వర్గ పోరు వదిలి గ్రామ అభివృద్దే ధ్యేయంగా పని చేయండని కోరారు. ముఖ్య మంత్రి వై.యెస్.జగన్మోహన్ రెడ్డి రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలను అందిస్తున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైసీపీ మద్దతు దారులను అఖండ మెజారిటీతో గెలుపొందా లాని, వైసీపీ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రామ నాయకులు గ్రామల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద గుమ్మడాపురం వైస్సార్సీపీ నాయకులు జక్కుల రా ము, నాగర్జున ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాల విద్యార్థులకు కోవిడ్ పరీక్షలు



**వేటపాలెం, ప్రజాపాలన:** స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కు బుధవారం కోవిడ్ టెస్టు నిర్వ హించడం జరిగింది. ఈ సందర్భం గా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ సుమారు 20 మందికి పైగా విఆర్డీ ఎల్ టెస్టులు నిర్వహించామన్నారు. కోవిడ్ వ్యాక్సిన్ గత రెండు రోజు లుగా నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్క రు తీసుకోవాలని పిలుపు నిచ్చారు. కరోనా సమయంలో ఫ్రంట్ లైన్ ఉద్యోగులగా విధులు నిర్వహించిన రెవిన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, సచివాలయ ఉద్యోగులు, వాలింటీ ర్లకు, ఆరోగ్య కార్యకర్తలకు వ్యాక్షిన్ తప్పనిసరిగా ఇవ్వాలని గౌరవ కలెక్టర్ అదేశమన్నారు. దేశంలో ఇప్పటికే 57 లక్షల మందికి పైగా వ్యాక్షిన్ తీసుకున్నారని, ఏ ఒక్కరికో ఇబ్బంది ఉందని వ్యాక్సిన్ తీసుకోవ డానికి భయపడాల్సిన అవసరంలే దన్నారు. ఫోన్ ద్వారా మెస్సేజ్ వచ్చి న, మాద్వారా ఫోన్ వచ్చిన మీరు వెంటనే వచ్చి టెస్టులు గానీ, వ్యాక్షిన్ గానీ చేయించుకోవలన్నారు. ప్రయి వేటు ఆసుపత్రిలో 2 నుండి 5 వేలు తీసుకుంటారని, ఆరోగ్య కేంద్రంలో ఐతే ఉచితంగా చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా కోవిడ్ పట్ల జాగ్రత్త లు పాటించడం లేదని కరోనా విష యంలో మస్కులు గానీ, శానిటేషన్ పద్ధతులు గాని పాటించడం లేదని అన్నారు. కరోనా తగ్గుముఖం పట్టిందని అజాగ్రత్త ఉండకూడదని జాగ్రత్త పాటిస్తూ వ్యాక్షిన్ కూడా తీసుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమం లో హెచ్ఈఓ వెంకటేశ్వర్లు, సూపర్ వైజర్ సురేష్ బాబు, ఎఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్నేహానికన్న మిన్న లోకాన లేదురా



**వేటపాలెం, ప్రజాపాలన :** స్నేహాని కన్న మిన్న లోకాన లేదురా అని బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల 1998 ఎస్.ఎస్.సి బ్యాచ్ విద్యార్థులు నిరూపించారు. కరోనా సమయంలో స్వర్గస్తుడైన వారి మిత్రుడు గుగ్గిలం శ్రీనివాసరావు (37) కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులలో ఉన్నారన్న విషయం తెలుసుకున్న మిత్రులు బుధవారం అతని భార్య పిల్లల పేరు పై లక్ష రూపాయల పోస్టల్ డిపాజిట్ చేసిన బాండ్ అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఒక మిత్రుడు మాట్లాడుతూ తమ స్నేహితుని భార్య జి నాగపూర్ణిమ, పిల్లలు నిహారిక, సాయి స్వరూప్ లకు భవిష్యత్తులో ఏమైనా ఆర్థిక ఇబ్బందులు ఉంటే తమకు తెలియపరచాలని భరోసా సైతం కల్పించమన్నారు. ఈ కార్యక్రమంలో వీరన్న, రాబ్బని, కోటేశ్వరరావు, కరీమ్, రత్నం, రవి, జయరాజు, అయ్యప్ప,అనిల్ , చంద్రశేఖర్ రెడ్డి, హనుమాచారి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# వివోఎలకు రికవరీలపై రివ్యూ మీటింగ్





**వేటపాలెం, ప్రజాపాలన :** స్థానిక మండల సమాఖ్యలో వివోఎ లకు రివ్యూ మీటింగ్ బుధవారం ఏర్పాటు చేయడం జరిగిందని ఎపిఎం బుదా టి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వివిధ రకాల రుణాలు పొందిన వారి నుంచి రికవరీ ఎలా చేయాలనే అంశంపై వివో ఎలకు అవగాహనా కల్పిం చడం జరిగిందన్నారు. సిఐఎఫ్ రికవరీ, స్త్రీ నిధి రికవరీ, బ్యాంకు లింక్ రుణాలు రికవరీ లపై రివ్యూ నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే ఇన్స్టిట్యూషన్ బిల్డింగ్ మొబైల్ బుక్ కీపింగ్ సక్రమంగా చేయుట గురించి చర్చించడం జరి గిందన్నారు. అంతేకాక ఎన్.ఎం. ఆర్.ఎల్ పథకంలో భాగంగా ముద్దల తయారు చేసే వారు, చిక్కీలు తయారు చేసేవారు, బేకరీ కి సంబంధించిన ఉత్పత్తులు, కూరగాయల ఉత్పత్తులు, పాల ఉ త్పత్తులు చేసేవారికి 40 వేల రూపాయలను 6 శాతం వడ్డీతో అనగా అర్ధరూపాయి వడ్డీతో గ్రూపు లో ఉన్నటువంటి సభ్యులకు రుణం గా ఇవ్వబడుతుందన్నారు. మన మండలంలో ఉన్నటువంటి మహిళ గ్రూప్ సభ్యులు అందరూ కూడా అవకాశాన్ని వినియోగించుకోవల సిందిగా తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డి పి ఎం సుబ్బా రావు, ఎల్ ఆర్ అంబేద్కర్, ఎపిఎం శ్రీనిధి కామేశ్వరి, సిసి కవిత తదితరులు పాల్గొన్నారు.

## 375 ఓట్లతో విజయం సాధించిన ఇందిరమ్మ

**నెల్లూరు ఫిబ్రవరి 10(ప్రజాపాలన) :** కావలి రెవెన్యూ డివిజన్ పరిధి లోని జలదంకి మండలం జలదం కి గ్రామపంచాయతీ సర్పంచ్ పోరు లో కి తన వెనకాల ఇటువంటి రాజకీయ నాయకులు అండ లేకుండా ప్రజాక్షేత్రంలోకి సింగిల్ గా సింహాల దూకి ప్రత్యర్థిపై 375 ఓట్లు మెజారిటీతో తిప్పారెడ్డి ఇందిరమ్మ ఘన విజయం సాధిం చారు. స్థానికుల వివరాల మేరకు ,ఆమెకు వైకాపాకు ఎటువంటి సంబంధం లేదన్నారు స్థానిక కొం దరు నాయకులు. ఆమె పెట్టిన ప్యానెల్‌ను అపహాస్యం చేశారు మరికొందరు. ఒంటరి మహిళ ఆమెకు ఎన్ని ఓట్లు ఉన్నాయని, పార్టీ నేతల వద్ద ఎగతాళి చేశారు ఇంకొందరు. కొందరి చేత రాయిం చారు.చెప్పించారు.

కానీ ఆమె అదర లేదు,బెదర లేదు,ఉడత ఊపులకు వెనుకాడేది లేదని. సింగిల్‌గా సిం హంలా జలదంకిలో ప్రజాక్షేత్రంలో కి దూకి, వెనుక నేతలు లేక పోయి నా, సామాన్య అభిమానుల తో, తన భర్త కోరికలు నెరవేర్చే లక్ష్యంతో జలదంకి సర్పంచ్ పదవి ని 375 ఓట్లకు పైగా మెజారిటీతో కైవసం చేసుకుంది తిప్పా రెడ్డి ఇందిరమ్మ. తన భర్త చివరి కోరిక తీర్చమని ప్రాధేయపడింది.ఎవరూ వినలేదు. యుద్ధరంగంలో పోరాడి సర్పంచ్ పదవిని సాధించుకొంది .

# ఉప్పు చంద్రశేఖర్ నుంచి ప్రాణ హాని ఉంది మహా ప్రభో

## విచారించి తగు న్యాయం చేయాలని వినతి

**నెల్లూరు ఫిబ్రవరి 10 (ప్రజాపా లన) :** నెల్లూరు గ్రామీణ మండ లం, గుండ్లపాలెం మజారా పరిధి లోని వడ్డెపాలెం గ్రామానికి చెందిన ఉప్పు చంద్ర శేఖర్ నుంచి తమకు ప్రాణహాని ఉందని విచారించి రక్షించండి మహాప్రభో అంటూ సదరు గ్రామానికి చెందిన ఉప్పు నరసింహులు ఆయన భార్య ఉప్పు పార్వతి అధికారులకు విజ్ఞప్తి చేశా రు. స్థానిక ప్రెస్ క్లబ్ లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా బాధితురాలు ఉప్పు పార్వతి మాట్లాడుతూ అంధురాలు అయినా నేను 2021 జనవరి 5న ఒంటరిగా ఇంట్లో ఉ న్న ఆ సమయంలో తన మరిది అయినటువంటి ఉప్పు చంద్ర శేఖర్ దురుద్దేశంతో ఇంట్లోకి ప్రవేశించి, నాపై లైంగిక దాడి చేయడమే కాకుండా, అతడి బలం కొద్దీ చేతులతో కాళ్లతో కొట్టాడని ఆరోపించారు.

అదే సమయంలో మధ్యాహ్న భోజనానికి తన భర్త అయిన ఉ ప్పు నరసింహులు ఇంటికి రావడంతో ఆయనపై కూడా కలియబడి కొట్టడం జరిగింది అన్నారు. ఈ విషయమై స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, వారి సలహా మేరకు ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొందడం జరిగిందన్నారు. ఈ క్రమంలో రాజకీయ ఒత్తిడికి లోనైనా రూరల్ పోలీస్ అధికారులు కేసును నీరుగార్చారని ఆవేదనచెందారు. ఈ విషయమై రూరల్ డి ఎస్ పి కి ఫిర్యాదు చేసినప్పటికీ ఉప్పు చంద్రశేఖర్ను అరెస్టు చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. మాకు సంతానం లేనందున మాకు ఉన్న ఆస్తిని బలవంతంగా స్వాధీనం చేసుకొనుట చంద్రశేఖర్ మరియు అతని బంధువులు నన్ను నా భర్తను చంపేందుకు కుట్రలు పన్నుతున్నారని తన ఆవేదన వ్యక్తపరిచారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, విచారించి, ఉప్పు చంద్ర శేఖర్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోకపోతే తమకు వారి చేతిలో మరణం తప్పదని విజ్ఞప్తి చేశారు.

దేశంలో ఏ సంస్థ కూడా ఇవ్వని అవకాశం మీ కోసం
SNEHA MACS Ltd.
Ph : 040-23233989
"THE SNEHA MUTUALLY AIDED CO-OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED."
Regd. No. TS/DCO/HYD/MACS/2017/314Dt 30th May 2017
SNEHA GROUP OF ORGANISATIONS SNEHA CLUB 20 YEARS CELEBRATIONS
స్నేహ పెన్షన్ స్కీమ్ లో
చేరండి ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోండి
01 జనవరి 2021 నుండి
7 సం॥ల పాటు డిపాజిట్ చేసిన వారికి
డబుల్ ఎమౌంట్ ఇవ్వబడును.
సంవత్సరానికి 11% వడ్డీ ఇవ్వబడును
మీ డిపాజిట్ పై లభించే వడ్డీ
రూ. 1,00,000/- రూ. 11,000/-
రూ. 5,00,000/- రూ. 55,000/-
రూ. 10,00,000/- రూ. 1,10,000/-
*షరతులు వర్తిస్తాయి
మీ మనవళ్ళకు మరియు మనవరాళ్ళకు
చదువుకు, పెళ్ళి కోసం కానుకగా
మీ డిపాజిట్ 7 సం॥కే రెట్టింపు (Double)
డాక్టర్ కె. శివ భాగ్యారావు IRS, VRS
చైర్మెన్
ఎస్. రామకృష్ణ
మాక్స్ ప్రెసిడెంట్
9133312134
రండీ...! త్వర పడండీ...!

ప్రజాపాలన

సంపాదకీయం

గురువారం 11 ఫిబ్రవరి 2021

# ఈ భావోద్వేగంలో భావమేమి?

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రోజురోజుకూ సాధువులా మారిపోతున్నారు. తెల్ల మబ్బులా గడ్డం రోజురోజుకూ పెరుగుతుండగా ఆయన మహర్షిలా కనిపిస్తున్నారు. సాధారణంగా మహర్షులు ప్రగాఢ ఆధ్యాత్మికత, వేదాంతం మూర్తీభవించిన మహానుభావులు కనుక వారికి రాగద్వేషాలు ఉండవు. బాధ, ఆవేశం, కోపం లాంటివి వారిని పట్టి పీడించవు. భగవద్గీతలో 'జ్ఞానినః స్తత్వ దర్శినః' అని చెప్పినట్లు ఆయన తత్వ జ్ఞానం పరిపూర్ణంగా తెలిసిన వ్యక్తిలా మారిపోతున్నారు. భారతదేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలకు అన్నిటికీ తన వద్దే సమాధానం ఉన్నదని భావిస్తున్నారు. అలాంటి నరేంద్ర మోదీ మంగళవారం నాడు రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ వీడ్కోలు కార్యక్రమం సందర్భంగా ఎందుకు కంటతడి పెట్టారు?

సాధారణంగా రాజ్యసభలో ప్రతి ఏడాది కొంతమంది సభ్యులు పదవీ విరమణ చేస్తూనే ఉంటారు. పదవీ విరమణ చేసిన వారిలో కొందరు తిరిగి వస్తారు. కొందరు తిరిగి రారు. లోకసభలో అందరి పదవీ కాలం ఒకే సారి ముగుస్తుంది కనుక ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకునే అవకాశం ఉండదు. రాజ్యసభలో ఆరేళ్లు పదవిలో ఉన్నప్పటికీ ఆ ఆరేళ్ల పదవీ కాలం పూర్తయిన వారు ప్రతి ఏడాదీ ఏదో ఒకరోజు పదవీవిరమణ చేస్తారు. అయినప్పటికీ తమ మధ్య నిన్నటి వరకూ ఉన్న సభ్యుడు ఉన్నట్లుండి పదవీవిరమణ చేసి వెళ్లిపోతే చుట్టూ ఉన్న వారికి బాధాకరంగా ఉంటుంది. అందరికీ తామూ వెళ్ళిపోయే రోజు కూడా ఏదో ఒక నాడు వస్తుందని తెలిసినప్పటికీ వెళ్లిపోయే వారి గురించి నాలుగు మంచి మాటలు మాట్లాడడం సహజం. నిజానికి నిన్నటి వరకూ ఒకరితో మరొకరు తీవ్రంగా విభేదించినప్పటికీ, వెల్‌లోకి దూసుకువచ్చినప్పటికీ, సభా కార్యక్రమాలు స్తంభింపచేసినప్పటికీ పదవీ విరమణ చేస్తున్న సభ్యుల గురించి సద్భావంతో మాట్లాడడం కద్దు. వారి కంటే గొప్ప పార్లమెంటేరియన్లు, ప్రజాస్వామిక వాదులు, అజాతశత్రువులు లేరని ప్రశంసించడంలోనూ ఆశ్చర్యం లేదు. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తగిన ఆరోగ్యకరమైన లక్షణమే. అంతేకాని రాజకీయాల్లో సహజంగా జరిగే ఒక పరిణామం గురించి ఎవరైనా కంటతడి పెడితే చాలా విచిత్రంగా ఉంటుంది. మరి ఆజాద్ రాజ్యసభ నుంచి వెళ్లిపోవడం పట్ల నరేంద్ర మోదీ ఎందుకు కన్నీరు కార్చారు?

గులాంనబీ ఆజాద్ ఏమీ ప్రధానమంత్రికి బాల్యస్నేహితుడు కాడు. ఇద్దరూ ఒక రాష్ట్రానికి చెందిన వారు కూడా కాదు. ఒకటి రెండు సందర్భాల్లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మోదీ అడిగిన సహాయాన్ని కేంద్ర మంత్రిగానో, జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రిగానో ఆజాద్ చేసి పెట్టి ఉండవచ్చు రాజకీయాల్లో ఉన్నప్పుడు ఇది సహజం. గత ఆరేళ్ళుగా మోదీ ప్రధానిగా ఉన్న కాలంలో ప్రతిపక్ష నేతగా గులాంనబీ ఆజాద్ బిజెపి ప్రభుత్వంతో అడుగడుగునా ఢీకొన్నారు. ఎన్నో సార్లు సభను స్తంభింపచేశారు. గత ఏడాది జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన అధికరణ 370ని రద్దు చేసినప్పుడు ఆజాద్ సృష్టించిన హంగామా అంతా ఇంతా కాదు. ప్రతిపక్ష నేత అన్న విషయం కూడా మరిచిపోయి ఆయన వెల్ లోకి వచ్చి చైర్మన్ సీటు ముందు కూర్చున్నారు. 'భారతదేశ కిరీటాన్ని ధరించిన జమ్మూ కశ్మీర్ తలను మీరు నరికేస్తారని నేను అనుకోలేదు. జమ్మూ కశ్మీర్‌కు ఉనికి లేకుండా చేశారు. ఇది భారతదేశ చరిత్రకు తీరని కళంకం. హోంమంత్రి అమిత్ షా తన మాటలతో సభలో అణుబాంబు పేల్చారు. జమ్మూ కశ్మీర్‌ను భారత చిత్రపటం నుంచే వేరు చేశారు. ఆ రాష్ట్రాన్ని దేశం నుంచి చీల్చివేశారు..' అని ఆజాద్ తీవ్ర పదజాలంతో విమర్శించారు.

అయినప్పటికీ ఆజాద్‌తో తన స్నేహాన్ని తలుచుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కన్నీరు కార్చారు. కశ్మీర్‌లో ఉగ్రవాద దాడిలో మరణించిన గుజరాతీల మృతదేహాలను తమ రాష్ట్రానికి పంపించడంలో ఆజాద్ చూపిన చొరవను తలుచుకుని ఆయన గద్గద స్వరంతో మాట్లాడారు. తన సహజ శైలిలో కన్నీటిని పంటి క్రింద అదిమిపెట్టుకుని మంచినీరు తాగారు, అక్కడితో ఆగకుండా ఆజాద్ తనకు 'నిజమైన స్నేహితుడు' అని అభివర్ణించారు, ఆజాద్‌ను తాను రిటైర్ కానివ్వనని, ఆయన సలహాలు తీసుకుంటూ ఉంటానని, తన ద్వారాలు ఆయనకోసం తెరిచి ఉంటాయని కూడా మోదీ చెప్పడం అనేకమందిని ఆశ్చర్యపరిచింది.

గత ఆరేళ్లలో కాంగ్రెస్ పూర్తిగా క్షీణించిపోగా, ఏడు పదులు నిండిన ఆజాద్ కూడా ప్రాభవం కోల్పోయారు. ఆజాద్ వంటి వ్యూహకర్తలను కొత్త తరంలో కాంగ్రెస్ సృష్టించుకోలేకపోయింది, అయినప్పటికీ రాజకీయ నాయకుడు రాజకీయనాయకుడే. తన రాజ్యసభ సీటు ఈ ఏడాదితో ముగుస్తుందని తెలిసినప్పటి నుంచీ ఆయన రాజకీయ ఎత్తుగడలు మొదలుపెట్టారు.

కాంగ్రెస్‌ను పునర్నిర్మాణం చేయాలని, ప్రజాస్వామికంగా ఎన్నికలు జరగాలని డిమాండ్ చేస్తూ 23 మంది నేతలతో కలిసి సోనియాకు గత ఏడాది లేఖాస్త్రం సంధించి సంచలనం సృష్టించారు. అనేక సందర్భాల్లో పార్టీ నేతృత్వానికి తిరుగులేదంటూ వందిమాగధత్వం ప్రదర్శించిన ఆజాద్ స్వభావానికి ఇది భిన్నమైనది, బహుశా నాయకత్వం తనను విస్మరించకూడదని, కేరళ నుంచో మరో చోటి నుంచో తనను తిరిగి రాజ్యసభకు ఎంపిక చేయాలని ఆయన భావిస్తుండవచ్చు. ప్రస్తుత పరిస్థితిలో అది జరిగే అవకాశం లేదని కాంగ్రెస్ అంతర్గత వర్గాలు చెబుతున్నాయి.

నరేంద్రమోదీకి మాత్రం ప్రతిపక్షంలో ఏ చిన్న నిప్పురవ్వ రగిలినా సంతోషకరమే అవుతుందనడంలో సందేహం లేదు. సోమవారం ఆయన రాజ్యసభలో మాట్లాడుతూ ఆజాద్‌తో పాటు 23 మంది నేతలు సోనియాకు రాసిన అసమ్మతి లేఖను ప్రస్తావించారు. మంగళవారం ఏకంగా ఆజాద్ పదవీవిరమణ పట్ల కంటతడి పెట్టడమే కాక తన ద్వారాలు తెరిచి ఉన్నాయని అనడంలో ఏదో ఒక సందేశం ఉండే ఉంటుంది. ఆజాద్ కూడా ఇందుకు జవాబిస్తూ తాను ఎన్నడూ పాకిస్థాన్ వెళ్లలేదని, తాను హిందుస్తానీ ముస్లింనేనని చెప్పడంలో అంతరార్థమేమైనా ఉన్నదా అని ఆలోచించాల్సి ఉంటుంది, జమ్మూ కశ్మీర్‌లో కొన్ని దశాబ్దాలుగా ఆజాద్‌కు మించిన నాయకుడు కాంగ్రెస్‌కు దొరకలేదు.

ఆయన హయాంలో కశ్మీర్‌లో ఎన్నో ఘాతుకాలు జరిగాయి. అయినప్పటికీ ఆజాద్ లాంటి నేతను ఏ పార్టీ అయినా రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూస్తుంది. కాంగ్రెస్‌లో ప్రాధాన్యత కోల్పోతే ఇన్నేళ్ల బంధాలను వదులుకుని మోదీ తెరిచిన ద్వారాల్లోకి ఆజాద్ ప్రవేశిస్తారా, కల్లోల కశ్మీర్‌లో మోదీకి ఆయన ఏ రూపంలోనైనా ఉపయోగపడతారా ఆలోచించాల్సి ఉంటుంది.

బహుశా మోదీ కన్నీరు వెనుక ఈ అర్థం ఉండి ఉంటుంది.

అయినా గతంలో కూడా మోదీ అనేక సార్లు కంటతడి పెట్టుకున్నారు. తన తల్లి అంట్లు తోమిందని చెబుతూ ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. గుజరాత్‌ను వదిలిపెట్టి వచ్చినందుకు దుఃఖించారు. ఆద్వాణీ తనపై దయ ఉంచమని చెప్పినందుకు గద్గద స్వరుడయ్యారు. డెహ్రాడూన్‌లో ప్రధానమంత్రి జనఔషధ్ యోజన పథకం తన భర్తను బతికించిందని, దీనితో తాను మోదీని దేవుడుగా కొలుస్తున్నానని ఒక మహిళ అన్నందుకు ఆయన కళ్లలో నీళ్లు నిండాయి. ఈ ఉదంతాలన్నీ ప్రధాన మంత్రి ఎంత సున్నిత మనస్కుడో మనకు తెలియజేస్తున్నాయి. రాజ్యసభలో ఒక ప్రతిపక్ష నేత పదవీ విరమణ చేసినప్పుడు కూడా ఆయన భావోద్వేగానికి గురి కావడం ఆయన సున్నితత్వాన్ని మరింత స్పష్టం చేసింది. బహుశా ఢిల్లీ సరిహద్దుల్లో రెండున్నర నెలలుగా రైతులు చేస్తున్న నిరసన ప్రదర్శన కూడా ఆయనను లోలోపల చలింప చేస్తూ ఉండాలి. ఇప్పటికే 70 మందికి పైగా రైతులు ఈ ప్రదర్శనలో మరణించగా సోమవారం టిక్రీలో మరో రైతు చెట్టుకు వేళ్లాడుతూ కనిపించాడు. ప్రధాని తన ప్రసంగంలో నిత్యం ఆందోళన జీవులను విమర్శించినప్పటికీ ఆయన మనసులో కూడా ఆందోళన రగులుతూనే ఉండాలి.

భారతదేశ రాజకీయాల్లో నరేంద్ర మోదీని విమర్శించే అవకాశం ఉన్నప్పటికీ విస్మరించే అవకాశం లేదు. మన ఆలోచనల్లో, మన చర్చల్లో మోదీ పూర్తిగా భాగమయ్యారనడంలో అతిశయోక్తి లేదు.

ఇద్దరు సామాన్య జీవులైనా, ఇద్దరు మేధావులైనా, ఇద్దరు పారిశ్రామికవేత్తలైనా, ఇద్దరు రాజకీయనాయకులైనా, చివరకు ఇద్దరు సాహిత్యకారులైనా పది నిమిషాలు చర్చించుకుంటే మోదీ అన్న పదం ఎప్పుడో ఒకప్పుడు దొర్లక మానదు. తన మాటలు, చేతలతోనే కాదు, తన ఆకారం, హావభావాలతో ఆయన మన మధ్య అప్రయత్నంగా ప్రత్యక్షమవుతు న్నారు. ఆయన కంటతడి సంపాదిం చడం అంత సులభం కాదు.

# స్త్రీ సంవేదనలకు స్వరమిచ్చిన సుబ్బలక్ష్మి

## నివాళి : శివరాజు సుబ్బలక్ష్మి

బుచ్చిబాబు రచనల కోసం ప్రతి బీరువా గాలిస్తున్నప్పుడు కానీ శివరాజు సుబ్బలక్ష్మిగారు కథలు, నవలలు రాసిందన్న విషయం తెలిసి రాలేదు. సిగ్గుపడ్డా. ఒక రచయిత్రిని ఇప్పటికైనా తెలుసుకోగలిగానని ఆనందపడ్డా. సమాజ సాహిత్య రంగాలలో ప్రముఖుల భార్యలను వారి నీడలుగా కాక ఆలోచించే మెదడు, అనుభూతి చెందే హృదయం, అనుభవం కోరే శరీరం ఉన్న సహజ మానవ వ్యక్తులుగా చూడటం నేర్చుకోవాలని సుబ్బలక్ష్మి గారి కథలు చెప్పకనే చెప్తాయి.

'చివరకు మిగిలేది' నవలపై ప్రారంభించిన పరిశోధనే 1978లో నన్ను శివరాజు సుబ్బలక్ష్మి గారిని వెతుక్కుంటూ వెళ్లేలా చేసింది. బుచ్చిబాబు సాహిత్య కళాజీవిత సమగ్ర సమాచార సేకరణకు తొలి వనరు ఆయన భార్యే కదా! ఆవిడ ఎక్కడుంటారు, కలవటం ఎలా అని ఆలోచిస్తున్నప్పుడు మొదలి నాగభూషణ శర్మగారు ఆవిడ హైదరాబాద్ లోనే ఉంటారని, వస్తే పరిచయం చేస్తానని అన్నారు. చేశారు. మామూలుగా అయితే ఇలాంటి పరిచయాలు ఒకటి రెండుసార్లు కలిసి పరిశోధనకు అవసరమైన మేరకు సమాచారం సేకరించుకొనటంతోనో, ఇంటర్వ్యూ పేరు మీద కొన్ని ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టుకొనటంతోనో ముగుస్తాయి. కానీ మా సంగతి అలా కాదు. బుచ్చిబాబును ఆమె ఎంత ప్రేమించిందో ఆయన మీద పరిశోధన చేస్తున్నానని నన్నంతగా చేరదీసి వాత్సల్యం చూపారు.

నా ప్రధాన సిద్ధాంత రచన నవల వరకే అయినా, ఆయన సమగ్ర వ్మాయ సూచిక తయారు చేయాలన్న నా సంకల్పానికి బండి గోపాలరెడ్డిగారి సలహా కూడా తోడై ఆయనకు వచ్చిన ఉత్తరాలు, వ్రానుకొన్న డైరీలు ఒక్క పేజీ వదలకుండా చూసి నోట్స్ వ్రాసుకోవలసి వచ్చింది. 1978–80 మధ్యకాలపు వేసవి సెలవులలో అదే పని మీద హైదరాబాద్ వెళ్లేదాన్ని. నేనెక్కడో బసచేసి పనికోసం వాళ్ళింటికి వెళ్ళటం ఆమెకు నచ్చేది కాదు. తార్నాకలో వాళ్ళది పెద్ద ఇల్లు. ఇంటి కంటే విశాలం ఆమె హృదయం. 'నేనూ మా తమ్ముడే కదా ఉండేది, నువ్వు కూడా ఇక్కడే ఉండు' అని నన్ను ఒప్పించారు. నా సహచరుడు వెంకటేశ్వర్లు అప్పుడు అక్కడ టిబి హాస్పిటల్‌లో ఛాతీ వైద్యంలో పోస్టుగ్రాడ్యుయేషన్ డిప్లొమా కొరకు చదువుతున్నాడు. 'అతనిని కూడా ఇక్కడికి రమ్మను.. ఇక్కడి నుండే వెళతాడు హాస్పిటల్?కు' అని ఆమె ఇచ్చిన ఆహ్వానంలో ఆర్ద్రత తలచుకొంటే ఇప్పటికీ గుండె తడి అవుతుంది. అలా నేను వాళ్ళింట్లో మనిషిని అయిపోయా. ఇంటికి ఎవరు వచ్చినా మా అమ్మాయి అని పరిచయం చేసేవారు.

సుబ్బలక్ష్మి గారు తరువాతి కాలంలో ఉద్యోగరీత్యా బెంగుళూరులో ఉన్న తన మేనల్లుడు దగ్గరికి వెళ్లి ఉన్నారు. తెలుగు ప్రాంతం నుండి వెళ్లినా తెలుగు సాహిత్య రంగంలో అనేకమందితో స్నేహసంబంధాలు కొనసాగించారు. ఆత్మకథ రాసుకున్నారు. సాహిత్య సభలకు హాజరయ్యారు. సత్కారాలు అందుకున్నారు. 96ఏళ్ల వయసులో ఫిబ్రవరి 6వ తేదీన బెంగుళూరులో మరణించారు. స్నేహం, ప్రేమ పంచి ఇచ్చిన మనుషులు మాయం కావటం మనసుకు నొప్పిగానే ఉంటుంది. నాకైతే మళ్ళీ అమ్మను కోల్పోయినట్లు ఉంది. ఉదయం సుబ్బలక్ష్మిగారితో ఫిల్టర్ కాఫీ



సంభాషణలు, భోజనాల దగ్గరి సంభాషణలు చాలా ఆసక్తికరంగా ఉండేవి. బుచ్చిబాబుగారు, తాను పుట్టి పెరిగిన గోదావరి జిల్లాల ప్రకృతి పరిసరాలలోకి నన్ను తీసుకువెళ్లి తిప్పేవి. 1930, 40 లనాటి నియోగి బ్రాహ్మణ కుటుంబ సంప్రదాయ సంస్కృతిని పరిచయం చేసేవి. బుచ్చిబాబుతో తన పెళ్లి దగ్గరనుండి కలిసి చేసిన జీవితకాలపు ప్రయాణంలోని భిన్నఘట్టాలను ఆమె కథనం చేసిన తీరు, నేనెప్పుడూ చూడని బుచ్చిబాబుతో నాకెంతో పరిచయాన్ని ఏర్పరచింది.

బుచ్చిబాబు గారికి రావలసినంత పేరు ప్రఖ్యాతులు రాలేదు అన్నది ఆవిడ ఆరోపణ. ఆయనకు సంబంధించిన జ్ఞాపకాలు, వస్తువులు, పుస్తకాలు అన్నీ అపురూపమే. అన్నిటినీ భద్రంగా దాచిన గది నా పని స్థలం. డబ్బాలు, సంచీలు, బస్తాలు బోర్లించి ప్రతి కాగితం చదివి నోట్స్ వ్రాసుకొన్నానంటే, రచనల ప్రచురణ కాలం వంటి వివరాలు సేకరించ గలిగానంటే, డైరీలు, లేఖలు ఎడిట్ చేసి వ్మాయ సూచికలో చేర్చగలిగానంటే అదంతా సుబ్బలక్ష్మి గారి సహృదయత కారణంగానే. నాలాంటి పరిశోధకులు ఉండవచ్చు గానీ, పరిశోధన విలువ తెలిసి సహకరించగల సుబ్బలక్ష్మిగారి వంటి వ్యక్తులు మాత్రం అరుదు. బుచ్చిబాబు జయంతులు, మరీ ముఖ్యంగా 2014లో శతజయంతి జరపటానికి, ఆయన పుస్తకాల పునర్ముద్రణకు, ఆయన పెయింటింగ్స్ పుస్తకంగా తీసుకురావటానికి ఆవిడ మౌనంగా ఎంత పని చేసారో, ఆమె మేనల్లుడు బుజ్జి ఆమెకు ఎంత వెన్నుదన్నుగా ఉన్నాడో నాకు తెలుసు. బుచ్చిబాబుపై సాహిత్య అకాడెమీ ప్రచురించవలసిన మోనోగ్రాఫ్ గురించి చివరివరకు కలవరిస్తూనే ఉన్నారు. చిత్రం ఏమిటంటే ఈ క్రమంలో ఆమె తాను రచయిత్రిని, చిత్రకారిణిని అన్న విషయం మర్చిపోవటం. స్త్రీలందరూ ఇంతేనా? బుచ్చిబాబు రచనల కోసం ప్రతి బీరువా గాలిస్తున్నప్పుడు కానీ సుబ్బలక్ష్మిగారు కథలు, నవలలు రాసిందన్న విషయం తెలిసి రాలేదు. సిగ్గుపడ్డా. ఒక రచయిత్రిని ఇప్పటికైనా తెలుసుకోగలిగానని ఆనందపడ్డా. జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి ఒక ఉత్తరంలో (30--3-1960) సుబ్బలక్ష్మి గారి 'కాపురం' కథ సరళంగా, మనుషుల మధ్య సంబంధాలు ఎంత సామరస్య పూర్వకంగా, సంస్కారవంతంగా ఉండాలో చూపింది అని మెచ్చుకొంటూ ఇంత శుభ్రంగా నువ్వు కథలు రాస్తావా అని బుచ్చిబాబును సవాలు చేసాడు. ఆ ఉత్తరం తక్షణం శివరాజు సుబ్బలక్ష్మి సాహిత్యంపై పరిశోధన చేయించాలన్న ప్రేరణ ఇచ్చింది. దాని ఫలితమే శివరాజు సుబ్బలక్ష్మి నవలలపై శశిరేఖ చేత ఎమ్?ఫిల్ డిగ్రీకోసం పరిశోధన చేయించటం. బుచ్చిబాబు భార్య అనా ఆమె నవలలు పరిశోధనాంశంగా తీసుకున్నది అని అధ్యాపక వర్గం నుండి వచ్చిన సవాళ్ళను ఎదుర్కొంటూ తన అనుభవాలు, అనుభూతులు, అభిప్రాయాలు అన్నీ ఆంతర్యపు లోతులకు నెట్టి జీవించాల్సిన అనివార్యతలో ఉన్న స్త్రీల జీవిత విషాదాన్ని, అందులోనే విజయాలను వెతుక్కొని సంతృప్తి చెందే తీరును సుబ్బలక్ష్మి గారు 'అదృష్ట రేఖ' వంటి తన నవలల్లో ఎలా చిత్రించిందో నిరూపించటానికి ప్రయత్నించింది శశిరేఖ. సమాజ సాహిత్య రంగాలలో ప్రముఖుల భార్యలను వారి నీడలుగా కాక ఆలోచించే మెదడు, అనుభూతి చెందే హృదయం, అనుభవం కోరే శరీరం ఉన్న సహజ మానవ వ్యక్తులుగా చూడటం నేర్చుకోవాలని సుబ్బలక్ష్మి గారి కథలు చెప్పకనే చెప్తాయి.

పన్నెండు ఏళ్ళ వయసులో, అంటే 1937 డిసెంబర్ 23న, బుచ్చిబాబుతో పెళ్లి అయింది. నిత్య చదువరి, రచయిత అయిన బుచ్చిబాబు సాహచర్యం, ఆయనకోసం ఇంటికి వచ్చిపోయే మొక్కపాటి, విశ్వనాథ సత్యనారాయణ, జరుక్ శాస్త్రి, ఆచంట జానకిరామ్, ఆచంట శారదాదేవి, పింగళి లక్ష్మీకాంతం వంటివాళ్లతో సాహిత్య సంభాషణలలో పాలు పంచుకొనటం ఆమెలో సాహిత్య సృజనాభిలాషను ప్రోది చేశాయి. భర్త కథలకు తొలి పాఠకురాలు కావటం కథ నడిపే నేర్పును పెంచింది. అలా 1960లలో ఆమె కథా రచన ప్రారంభం అయింది. ఆమె కథలు నాలుగు సంపుటాలుగా వచ్చాయి. అవి 'మనోవ్యాధికి మందుంది', 'మగతజీవి చివరి చూపు', 'ఒడ్డుకు చేరిన కెరటం', 'కావ్యసుందరికథ'. 'అదృష్ట రేఖ', 'నీలం గేటు అయ్యవారు', 'తీర్పు' ఆమె రాసిన నవలలు. మధ్యతరగతి స్త్రీల సంవేదనలకు స్వరం ఇచ్చిన సాహిత్యం ఆమెది. 'సుబ్బలక్ష్మి కథలలో విశిష్టత చాలా భాగం ఇవి స్త్రీ మాత్రమే వ్రాయగలదు అనిపించటం' అని పింగళి లక్ష్మీకాంతం గారు ప్రశంసించిన ఆమె కథలను, నవలలను కూడా స్త్రీవాద దృక్పథం నుంచి తరచి చూసి విలువకట్టవలసిన పని ముందే ఉంది. సుబ్బలక్ష్మి మంచి చిత్రకారిణి కూడా. ప్రత్యేక శ్రద్ధతో బుచ్చిబాబువి, తనవి ఎంపిక చేసిన కొన్ని పెయింటింగ్స్‌తో అందమైన ఇంద్రధనస్సు రంగుల పుస్తకాన్ని వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రచురించారు. ఆ పుస్తకాన్ని అపురూపంగా ఒళ్ళోపెట్టుకొని పేజీలు తిప్పి చూపిస్తున్నప్పుడు ఆమె కళ్ళల్లో సంతృప్తితో కూడిన చిరునవ్వు ప్రసారం నా కళ్ళముందు ఇంకా కదలాడుతూనే ఉంది. బుచ్చిబాబు భౌతికంగా తన నుండి వేరై యాభై ఏళ్ళుఅవుతున్నా ఆయనను తనలో ఎంత సజీవంగా నిలుపుకున్నారంటే, సంభాషణ ఎక్కడ మొదలైనా బుచ్చిబాబు దగ్గరకు తీసుకెళ్లకుండా అది ముగిసేది కాదు. పార్వతిని శరీరంలో సగం చేసుకొన్న శివుడు మనకు తెలుసు. ఈమె పరమేశ్వరుడి శరీరాన్నే కాదు, కళాసాహిత్య సృజన వ్యక్తిత్వాన్ని తనలో సంలీనం చేసుకొన్న పార్వతి. 'ప్రశాంతంగా ఉండాలంటే పాతవాటిని కలుపుకొని కొత్త ఊహల్లో జీవించటం అలవరచుకోవాలి' అని ఇరవయ్యేళ్ళ క్రితం ఒక స్త్రీల సాహిత్య సదస్సులో ఆవిడ ప్రతిపాదించిన జీవన సూత్రం తాళం చెవిగా ఆమె సాహిత్యం అధ్యయనం చేయటం ఆమెకు మనం ఇయ్యగల నివాళి.

## మొదటి దశ పంచాయతీ పోరు ప్రశాంతం



**చేబ్రోలు, ప్రజా పాలన :** మొదటి దశ పంచాయతీ పోరు చెదురుముదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది మనలో మొత్తం 13 పంచాయతీలు గానూ 9 పంచాయతీలు వైసిపి కైవసం చేసుకోగా మిగిలిన నాలుగు పంచాయతీలు టిడిపి దక్కించుకున్నది అయితే గుంటూరు జిల్లాలోని రెండో మేజర్ పంచాయతీ అయినా చేబ్రోలు లో సుమారు 20 వేల ఓటర్లు కలిగి ఉన్నారు అయితే ఈ నెల 9న జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో వైసిపి, టిడిపి, జనసేన, వైసీపీ రెబల్ మొత్తం నలుగురు అభ్యర్థులు పోటీ పడగా వైసీపీ అభ్యర్థి అయినటువంటి అత్తోట వినీత రాణి సుమారు 1500 ఓట్లతో విజయాన్ని సొంతం చేసుకున్నారు అనంతరం ఎన్నికల అధికారి నుంచి క్లారిఫికేషన్ ఫామ్ కూడా తీసుకున్నారు అనంతరం బాణాసంచా పిలుస్తూ పెద్ద ఎత్తున వైసిపి కార్యకర్తలతో, నాయకులతో చేబ్రోలు గ్రామ పురవీధులలో భారీ ఊరేగింపుతో జిందాబాద్ లు కొడుతూ ఓటు వేసిన వారికి అభినందనలు తెలుపుతూ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు

## అపరాలు పైరు పరిశీలించిన శాస్త్రవేత్తలు



**పొన్నూరు, ప్రజాపాలన :** రైతులు రబీ పంటలుగా వేసిన మినుము,పెసర తదితర అపరాలు పైరుకు ప్రస్తుతం తల మాడు తెగులు, వివిధ రకాలైన పురుగులు ఆశించి ఉన్నందున సస్యరక్షణ చర్యలు తప్పనిసరి అని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచించారు. బుధవారం పొన్నూరు మండలంలోని ములుకుదురు గ్రామంలో అపరాలు పైరులను పరిశీలించారు. పరిశీలించిన వారిలో గుంటూరు జిల్లా డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ నగేష్,సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శివన్నారాయణ, పొన్నూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సి హెచ్.తిరుమలాదేవి, మండల వ్యవసాయ అధికారి బి.ఆడంబాబు తదితరులు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.పైరుకు తల మాడు తెగులు,తామరపురుగు,తదితర పురుగులు ఆసించి ఉన్నాయన్నారు.వాటి నివారణకు అవసరమైన మందులను వాటిని పిచికారీ చేసే విధానాన్ని రైతులకు వివరించారు.

## జనసేన పార్టీ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్



**రాజుపాలెం (ప్రజాపాలన) :** సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలంలోని అంచులవారిపాలెం గ్రామం నుంచి సర్పంచ్ అభ్యర్థి గా నామినేషన్ దాఖలు చేసిన సత్తెనపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు తోట.నర్సయ్య. నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు తవిటి. భవన్నారాయణ ,దార్ల.శ్రీనివాస్ , కేదారి.రమేష్, రాజుపాలెం మండల, అంచులువారిపాలెం గ్రామ శ్రేయోభిలాషులు, జనసేన పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ రద్దు చేయాలి

**నరసరావుపేట, ప్రజాపాలన :** నకరికల్లు మండల కేంద్రమైన నకరికల్లులో "నేటియువత" గ్రూపు సభ్యుల సమావేశం బుధవారం జరిగినది.ఈ సమావేశంలో గ్రూపు సభ్యులు మాట్లాడుతూ ఆంధ్రుల కల్పతరువు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్రప్రభుత్వం ప్రైవేటీ కరణపై తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు.వారు మాట్లాడుతూ బడ్జెట్ లో ఆంధ్రాకు ఎప్పుడూ అన్యాయం జరుగుతుందని,రాష్ట్ర విభజన సమయంలో మేము అధికారంలోకి వస్తే ఆంధ్రా అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామని చెప్పిన బిజెపి యేరు దాటాకా బోడి మల్లన్న లాగా ప్రవర్తిస్తుందని మండిపడ్డారు.ప్రత్యేక హెూదా ఇస్తామని బిజెపి ఇవ్వడం సాధ్యం కాదని వంకలు చెపుతున్నదని,అన్ని వస్తువులను జి.ఎస్.టి.లో చేర్చి పెట్రోల్, డీజిల్ ను మాత్రం చేర్చకుండ సామాన్యుడి నడ్డి విరుస్తుందని,మొన్నటి కరోనా విపత్తుతో అతలాకుతలం అయిన ప్రజలు ప్రస్తుతం నింగికెగిసిన నిత్యావసర ధరలతో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.నేటియువత ఏ పార్టీకి వ్యతిరేకం కాదని కేవలం ప్రజా సమస్యలపై మాత్రమే పోరాడుతుందని తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలమంది రోడ్డున పడతారని కనుక కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి విశాఖ ఉక్కు కర్మాగారంను ప్రభుత్వ పరం చేయాలని లేని యెడల నేటియువత గ్రూపు తరపున కుల,మత,వర్గ,రాజకీయ బేధాలు లేకుండా అందరిని కలుపుకొని పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

# ఘనంగా గుణదలమాత మహెూత్సవాలు ప్రారంభం






**విజయవాడ, ఫిబ్రవరి 9 (ప్రజా పాలన) :** శ్రీసభలో మరియమాత ఆధ్యాత్మిక తల్లిగా కొనియాడ బడుతూ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది క్రైస్తవులచేత విరాజిల్లుతూ నీరాజనాలు అందుకుంటుందని విజయవాడ కతోలిక వీరం రజత జూబిలేరియన్ రేవ ఫాదర్ వల్లే విజయ జోజిబాబు పేర్కొన్నారు. గుణదలకొండపై కొలువుదీరిన గుణదల మాత మహెూత్సవాలు మంగళవారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి . బిషప్ గ్రాస్ హైస్కూల్ గ్రౌండ్ లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కళావేదికపై విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు , మోన్సిస్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ , వికార్ జనరల్ ఫాదర్ యం . గాబ్రియేలు , పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు , ఎస్ఎస్ డైరెక్టర్ ఫాదర్ మసలు థోమస్ , స్వర్ణ జూబిలేరియన్ ఫాదర్ మల్లవల్లి బాలస్వామి , రజత జూబిలేరియన్ ఫాదర్ వల్లే విజయజోజిబాబు తదితర గురువులు జ్యోతి ప్రజ్వలన చేసి మహెూత్స వాలను లాంఛనంగా ప్రారంభించారు . ఈ సందర్భంగా రజత జూబి లేరియస్ విజయజోజిబాబు భక్తులకు వ్యాప్తోదేశం చేస్తూ 4 వ శతాబ్దంలో పునీత ఆంబ్రోస్ వారు మరియతల్లికి తిరుసభలో ప్రత్యేక స్థానం ఇవ్వబడిందని గుర్తుచేశారు . 1885 లో పరిశుద్ధ లియో పోప్ మరియతల్లిని రక్షణతల్లిగా ప్రస్తావించటం జరిగిందని తెలిపారు . రెండో వాటికన్ మహాసభలలో మరియమాతని తిరుసభ గ్రంథంలో ఒక భాగంగా గుర్తించటం జరిగిం దని చెప్పారు . 2018 లో ప్రస్తుత పరిశుద్ధ పోప్ ఫ్రాన్సిస్ క్రీస్తు ప్రభువైన మరియ తల్లిని విరుసభ మాతగా గుర్తిస్తూ ఫిబ్రవరి 11 వ తేదీన మరియ మాత మహెూత్స వాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదేశాలు జారీచేయటం జరిగిందన్నారు . మరియ మాత భక్తులచేత కొనియాడబడుతూ మనం ఆపదలో ఉన్న సమయంలో మనకు ఆమె రక్షణగా నిలబడుతుందని అన్నారు. కరోనా కారణంగా ఈ సంవత్సరం గుణదలమాత మహెూత్సవాలు రద్దు అవుతాయామోనని ప్రతి క్రైస్తవ భక్తులలో సందేహాలు కలిగాయని, అయితే గుణదల మాత ఆశీస్సుల వల్ల ఏ విధమైన ఆటంకాలు కలుగ కపోవటంతో ఉత్సవాలను నిర్వహి స్తున్నామని తెలిపారు . 1925 వ సంవత్సరంలో ఉత్సవాలు ప్రారం భం అయిన నాటి నుంచి , ఒక 1948 వ సంవత్సరం సంవత్సరం కలరా వ్యాధి కారణంగా ఆనాడు గుణదల మాత ఉత్సవాలు రద్దు కావటం జరిగిందని , మరి ఇప్పటి వరకు ఏనాడు గుణదల మాత ఉత్సవాలు రద్దు కాలేదని తెలిపారు . విజయవాడ కతోలిక పీఠం బిషప్ జోసఫ్ రాజారావు మాట్లాడుతూ గుణదల పుణ్యక్షేత్రం అద్భుతాల నిలయంగా వర్ధిల్లుతుందని విజ యవాడ కతోలికపీఠంలో స్వర్ణ , రజిత, జూబ్లీ ఉత్సవాలు జరుపుకుం టున్న ఫాదర్ మల్లవల్లి బాలస్వామి, ఫాదర్ వల్లే విజయ జోజి బాబుల సేవలను కొనియాడుతూ ఆయన అభినందించారు . ఈ సంవత్సరం కోవిడ్ కారణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం మరియ మాత ఉత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు . అనంతరం బిషప్ గ్రాసి హైస్కూల్ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన పూజా పీఠంపై స్వర్ణ, రజిత, జూబిలేరియన్ గురు వులు ఫాదర్ మల్లపల్లి బాలస్వామి, ఫాదర్ వల్లే విజయజోజిబాబు, బిషప్ తెలగతోటి జోసఫ్ రాజా రావు, ఫాదర్ దుర్గం మెల్కియర్, మోన్సిన్యోర్ ఫాదర్1 . మువ్వల ప్రసాద్ , వికార్ జనరల్ ఫాదర్ యం. గాబ్రియేలు , గుణదల పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు , ఎస్ఎస్ సి డైరెక్టర్ ఫాదర్ పసల థోమస్ , ఎడ్యుకేషన్ డస్క్ డైరెక్టర్ ఫాదర్ కొలకాని మరియన్న తదితర గురువులు " సమష్టి దివ్యపూజాబలి " సమర్పించారు . పూజానంతరం గురువులు కతోలిక క్రైస్తవ భక్తులకు దివ్య సత్ప్రసాదం అందజేశారు. పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు తదితర 70 మందికి పైగా గురువులు " సమష్టి దివ్యపూజాబలి " సమర్పించారు . భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్ ఇంటి ఆంథోని, ఫాదర్ తోట మరియ దాసు తదితర గురు వులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

## బ్రాహ్మణ కోడూరు గ్రామ సర్పంచ్ ఓట్లు రీకౌంటింగ్ జరపాలి

### మాజీ జడ్పీటీసీ సభ్యుడు కోటా డిమాండ్



**పొన్నూరు, ప్రజాపాలన :** పొన్నూరు మండలం బ్రాహ్మణ కోడూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నిక విషయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏక పక్షంగా వ్యవహరించారని ఒక పక్షానికి కొమ్ము కాచి ఫలితాన్ని తారుమారు చేసి ప్రకటించారని ఈ విషయంలో రి కౌంటింగ్ జరపాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు వైకాపా సీనియర్ నేత కోటా శ్రీనివాసరావు, వైకాపా బలపరిచిన అభ్యర్థి సొపాటి ప్రేమ కుమార్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు ఒక వినతిపత్రం తెనాలి సబ్ కలెక్టర్ కు అందజేశారు. మూడు వేలలోపు ఓట్లు కలిగిన అన్ని గ్రామాలకు లెక్కింపు రాత్రి 9గంటలకు ముగియగా బ్రాహ్మణ కోడూరు గ్రామ రిటర్నింగ్ అధికారి తెల్లవారు జాము 4గంటలవరకు సాచాతు చేసి టీడీపీ అభ్యర్థి కొర్నేపాటి అశోక్ 11ఓట్లు ఆధిక్యతతో గెలుపొందినట్లు ప్రక టించి అన్యాయానికి పాల్పడ్డారని ఆరోపించారు. మధ్యలో రెండు పర్యాయాలు కరెంట్ పోవడం ఏలాంటి ఇబ్బందులు లేకపోయినప్పటికీ సబ్ కలెక్టర్ అడిగేవరకు ఫలితాన్ని ప్రకటించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సంబంధిత అధికారులు పోలింగ్ ఏజంట్లను కూడా ఆయన ఖాతరు చేయలేదన్నారు.కావున సర్పంచ్ ఓట్లు రీకౌంటింగ్ చేయాలని కోటా డిమాండ్ చేశారు.తమ అభ్యర్థి కి న్యాయం చేయాలని కోరారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



**రాజుపాలెం, ప్రజా పాలన :** గుంటూరు జిల్లా రాజుపాలెం మండలం అనుపాలెం గ్రామం లో మాజీ సర్పంచ్ గోగుల అంజయ్య కుమారుడు గోగుల వెంకటేశ్వరరావు వయస్సు 38 సంవత్సరాలు ముగ్గురు పిల్లలు ఈరోజు ఉదయం 7 నుండి 8గం సమయంలో పొలంలోకి వెళ్లి అక్కడ ఉన్న మోటర్ ని వేసి ఆడే సమయంలో మోటర్ మీద చేయి వేసి అక్కడికక్కడే చనిపోయాడు గ్రామస్తులు వెళ్లి చూసేసరికి మోటర్ మీదపడి శవంఉంది.

## అంచులవారిపాలెం సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ దాఖలు



**రాజుపాలెం, ప్రజాపాలన :** సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలంలోని అంచులవారిపాలెం గ్రామం నుంచి సర్పంచ్ అభ్యర్థి గా నామినేషన్ దాఖలు చేసిన సత్తెనపల్లి నియోజకవర్గ కసభ్యనామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అంచుల నరసింహారావు భార్య మాజీ సర్పంచ్ శ్రీమతి అంచుల అమరవాణి పంచాయతీ సర్పంచి పదవికి నామినేషన్ దాఖలు చేసిన రాజుపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అంచుల నరసింహారావు గారి భార్య మాజీ సర్పంచ్ అంచుల అమరవాణి గారు

## రైతులకు పగలే 9 గంటలు నాణ్యమైన కరెంట్ అందిస్తాం : డి ఈ జగన్మోహన్ రెడ్డి

**పాములపాడు ఫిబ్రవరి 10 (ప్రజాపాలన) :** పాములపాడు మండల కేంద్రంలోని విద్యుత్ ఉపకేంద్రం నుండి రైతులకు పగలే 9 గంటల నాణ్యమైన కరెంటు అందిస్తామని కర్నూల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఆయన బుధవారం పాములపాడు విద్యుత్తు ఉపకేంద్రం లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫారంను డి ఈ జగన్మోహన్ రెడ్డి, ఏ డి భగవాన్ దాస్, ఏ ఈ నాగార్జున, రైతులతో కలిసి సాంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు రాత్రివేళల్లో పొలాలకు వెళ్లి చాలా ప్రమాదాలు జరిగాయని అన్నారు ఈ నూతన ట్రాన్స్ ఫార్మర్ అమర్చడం వల్ల రాత్రి వేళల్లో రైతులు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయసింహారెడ్డి, హరి గౌడ్, మధు కృష్ణ, కోట్ల నాగేశ్వర్ రెడ్డి, శివనాగిరెడ్డి, లైన్ మెన్ నాగిరెడ్డి, విద్యుత్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు

## లారీ డ్రైవర్లకు మోటారు వాహనాల చట్టం న్యూ ప్రొవిజన్ గురించి అవగాహన





**గుంటూరు. ప్రజాపాలన :** 32వ జాతీయ రహదారిభద్రతా కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గురు ఆంజనేయులు సహకారంతో రోడ్డు భద్రతా మరియు లారీ డ్రైవర్ల కు మోటారు వాహనాల చట్టం న్యూ ప్రొవిజన్ అవగాహన కలిపించాము అని గుంటూరు జిల్లా రహదారి భద్రతా కమిటీ నాన్ ఆఫీసీయెూ సభ్యులు మరియూ ప్రెసిడెంట్ రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ ఆర్. కె. దుర్గ పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా డ్రైవర్ల నుద్దేశించి మాట్లాడుతూ దేశంలో రోడ్డు ప్రమాదాల్లో అనేకమంది ప్రణాలుకోల్పోయిన అంశం మీకు అందరికి తెలిసిందే అని, మన రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రోడ్డు ప్రమాదాల నివారణకు అనేక చర్యలు చేపట్టారు అని మరీ ముఖ్యంగా యన్. జి. ఓ సంస్థల ద్వారా రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు డ్రైవర్లకు తెలుయజేయాలి అని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది అని చెపుతూ, మన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పేర్ని వెంకట రామయ్య ఢిల్లీలో జరిగిన ముప్పయి రెండవ జాతీయ రహదారి భద్రతా సదస్సులో పాల్గొని కరోన మరణాల కంటే రోడ్డు ప్రమాదాల మరణాలు ఎక్కువగా ఉన్నాయి అని అన్నారని తెలిపారు అనంతరం డ్రైవర్ల కు రోడ్డు సిగ్నల్ చార్ట్లు అందజేశారు.ఈ సందర్భంగా లారీ ఓవనర్స్ మరియూ డ్రైవర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ గురు ఆంజనేయులుగారు మాట్లాడుతూ ఈ యెుక్క రోడ్డు భద్రతా కార్యక్రమము ద్వారా డ్రైవర్లు రోడ్డు భద్రత పై అవగాహన పొందారు అని ముక్యంగా డ్రైవర్లు ట్రాన్స్పోర్ట్ వెహికల్ లైసెన్సు కొరకు అప్లై చేయాలి అంటే పదవ తరగతి అడుగుతున్నారు అని దీనిపై పద్మజ గారు గుంటూరు జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం మాట్లాడాలి అని కోరారు. అనంతరం అసోసియేషన్ ప్రెసిడెంట్ గురు ఆంజనేయులు ని దుశ్శాలువతో సత్కరించి మెమెంటో ఇవ్వడం జరిగింది అని పద్మజ తెలిపారు .ఈ కార్యక్రమం లో యన్. జి. ఓ సభ్యులు బాషా , కోటేశ్వరరావు లు పాల్గొన్నారు.

# జగన్ టేకోవర్ దిశగా అడుగులు

**విజయవాడ, ఫిబ్రవరి 10, (ప్రజాపాలన) :** జగన్ అంటే చాలా మందికి తెలిసింది బహు తక్కువ. జగన్ వైఎస్సార్ కుమారుడిగానే అందరికీ తెలుసు. ఇక ఆయన వైసీపీని స్థాపించి పోరాడి మరీ ముఖ్యమంత్రి అయ్యారు. అంటే ఒక సక్సెస్ ఫుల్ పొలిటీషియన్ గానే జనాలు జగన్‌ని గుర్తు పెట్టుకుంటారు. కానీ జగన్ మొదట సక్సెస్ ఫుల్ బిజినెస్ మ్యాన్. జగన్ వ్యాపారదక్షత గురించి ఆయన్ని బాగా ఎరిగిన వ్యాపారవేత్తలు ఎక్కువగానే చెబుతారు. ఒక వ్యాపారవేత్త జన నేతగా మారడం అంటేనే గ్రేట్. జగన్ ఆ రేర్ ఫీట్ ని సాధించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ని రక్షించాలంటూ జగన్ ప్రధాని మోడీకి రాసిన లేఖ ఒకసారి కనుక పరిశీలిస్తే అందులో రాజకీయ విన్నపాలు కంటే కూడా ఒక విజయవంతమైన వ్యాపారవేత్త నష్టాలలో ఉన్న పరిశ్రమను ఎలా గట్టెక్కించవచ్చో తెలియచేసే విలువైన సూచనలు, సలహాలుఉన్నాయి. ఇదిలా ఉంటే జగన్ స్టీల్ ప్లాంట్ వంటి సంస్థ లాభాల పాట చాలా తొందరలోనే పడుతుందని కూడా అంచనా వేశారు. దానికి తీసుకోవాల్సిన చర్యలు ఏంటో కేంద్రానికి చెప్పారు. మరి ఇదే సీఎం సీట్లో మరొకరు ఉంటే మాత్రం ప్రైవేటీకరణ వద్దు అని మాత్రం విన్నవించేవారు కానీ ఎందుకు చేయరాదు అని ఇంత పక్కాగా చెప్పగలిగేవారు కాదని మేధావులు కూడా అంటున్నారు. రెండు లక్షల కోట్ల రూపాయల విలువ చేసే భూమి, ప్రత్యక్షంగా పరోక్షంగా అయిదు లక్షల మంది ప్రజలకు ఉపాధి, విశాఖకు ఒక గర్వకారణం అయిన స్టీల్ ప్లాంట్ విషయంలో జగన్ ఆలోచనలు వేరేగా ఉన్నాయని అంటున్నారు. ఒకవేళ కేంద్రం కనుక ప్రైవేటీకరణకే పట్టుపడితే మాత్రం కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ని టేకోవర్ చేయాలని కూడా జగన్ ఆలోచిస్తున్నట్లుగా చెబుతు న్నారు. కచ్చితంగా స్టీల్ ప్లాంట్ తొందరలో లాభాల బాట పడుతుందని జగన్‌కి ఉన్న నమ్మకమే ఇందుకు కారణం. అలాగే విభజన హామీల మేరకు ఈ స్టీల్ ప్లాంట్ కి రాష్ట్రానికి వదిలేసి ప్లాంట్ తీసుకున్న రుణమొత్తం 22 వేల కోట్లను ఈక్విటీగా మార్చాలని కూడా జగన్ సూచిస్తున్నారు. విశా ఖను పాలనారాజధానిగా చేస్తున్న జగన్‌కి స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉండడం చాలా ముఖ్యం. విశాఖ ముంగిటకు పాలనకు తీసుకోక ముందే ఈ సమస్యను ఒక కొలిక్కి తీసుకురావడం కూడా అవశ్యం. అయితే ఈ విషయంలో కేంద్రాన్ని ఎదిరించడం కంటే కూడా నచ్చ చెప్పే ప్లాంట్ పరిరక్షణ జరిగేలా చూ డాలని జగన్ అనుకుంటున్నారు. అందువల్ల జగన్ ప్లాన్ ఏ, బీ, సీలను కూడా రెడీ చేసుకున్నారని చెబుతున్నారు. మొత్తానికి జగన్ లోని రెండవ కోణాన్ని కూడా ఇపుడు రాష్ట్రం దేశం చూసే సమయం వచ్చింది అంటున్నారు.

# భారీ ఆశలతో కేజ్రీవాల్



**లక్నో, ఫిబ్రవరి 10, (ప్రజాపాలన) :** ప్రాంతీయ పార్టీగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీని కేజ్రీవాల్ జాతీయ పార్టీగా తీర్చిదిద్దాలని గత కొన్నేళ్లుగా తపన పడుతున్నారు. అయితే అది సాధ్యం కావడం లేదు. జాతీయపార్టీగా ఆమ్ ఆద్మీ పార్టీని తీర్చి దిద్ది హస్తిన పీఠాన్ని అధిష్టించాలన్నది అరవింద్ కేజ్రీవాల్ బలమైన కోరికగా ఉంది. అయితే ఆచరణ సాధ్యమా? అన్నది ప్రశ్నే. ఢిల్లీ అసెంబ్లీ వరకూ కేజ్రీవాల్ కు తిరుగులేదు. ఢిల్లీ ప్రజలు ఇప్పటికి మూడు సార్లు ముఖ్యమంత్రిని చేశారు. తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. కానీ ఇతర రాష్ట్రాల్లో మాత్రం ఆమ్ ఆద్మీ పార్టీని కేజ్రీవాల్ కనీస స్థాయికి గత ఏడెనిమిదేళ్లుగా తీసుకెళ్లలేకపోయారు. అనేక రాష్ట్రాల్లో ప్రయత్నించి విఫలమయ్యారు. ఒక్క గోవా, పంజాబ్ రాష్ట్రాల్లో తప్పించి ఎక్కడా ఆమ్ ఆద్మీ పార్టీ బోణీ కూడా కొట్టలేకపోయింది. ఇందుకు ప్రధాన కారణాలు ఢిల్లీపై పెట్టిన శ్రద్ధ కేజ్రీవాల్ ఇతర రాష్ట్రాలపై పెట్టకపోవడమేనంటున్నారు. దీంతోపాటు ఢిల్లీ పరిస్థితులకు, ఇతర రాష్ట్రాల్లోని సామాజిక, ఆర్థిక పరిస్థితులకు తేడా ఉందంటున్నారు. మరోసారి కేజ్రీవాల్ ఆరు రాష్ట్రాల్లో పోటీ చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. వచ్చే ఏడాది జరగనున్న ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, గోవా, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. జాతీయ కార్యవర్గ సమావేశాల్లో కేజ్రీవాల్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ ఆరు రాష్ట్రాల్లో పంజాబ్, గోవా మినహా ఎక్కడా కేజ్రీవాల్ పార్టీకి పట్టు లేదనే చెప్పాలి. గోవాలో కొంత పోటీ ఇచ్చే అవకాశముందని విశ్లేషకులు సయితం అంగీకరిస్తున్నారు. ఉత్తర్ ప్రదేశ్ లో ఉన్న సామాజిక సమీకరణాలు, కుల, మత రాజకీయాలను చూస్తే కేజ్రీవాల్ కాలు మోపడమూ కష్టమేనంటున్నారు. ఉత్తరాఖండ్ లోనూ అదే పరిస్థితి. అరవింద్ కేజ్రీవాల్ కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఆమ్ ఆద్మీ పార్టీని బలోపేతం చేయాలని అనుకున్నప్పటికీ ప్రాంతీయ పార్టీలు, సామాజిక సమీకరణాల నేపథ్యంలో అది సాధ్యపడటం లేదు. మొత్తం మీద ఢిల్లీ ముఖ్యమంత్రి స్థాయి నుంచి మరింత అత్యున్నత పదవిని చేపట్టాలన్న ఆయన కోరిక మాత్రం ఇప్పట్లో నెరవేరదనే చెప్పాలి.

# చిత్తూరు రూరల్‌లో వైకాపా విజయం

**చిత్తూరు ఫిబ్రవరి 10, (ప్రజాపాలన) :** చిత్తూరు రూరల్ మండలంలో పలు పంచాయతీల వైఎస్సార్ సీపీ మద్దతుదారులు సర్పంచిగా గెలుపొందారు. పాలూరు సర్పంచ్ గా పాప అమ్మాళ్, పచ్చన పల్లి సర్పంచ్ గా హంస , తాళం బెడు సర్పంచిగా అమర్నాథ్ రెడ్డి గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ గెలుపొందడం జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాల ప్రజల ఆదరణ తో విజయం సాధించామని తెలిపారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు లేకుండా గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తానన్నారు . తమను గెలిపించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# నోట్ల పండుగగా మారిన పంచాయితీ ఎన్నికలు

**అమరావతి ఫిబ్రవరి 10 (ప్రజాపాలన) :** ఏపీలో జరిగిన పంచాయితీ ఎన్నికలు ఓటర్లకు నోట్ల పండుగగా మారింది. పశ్చిమగోదావరి జిల్లాలోని ఒక గ్రామంలో తొలిదశ పోలింగ్ సందర్భంగా ఓటుకు నోటు పంపిణీ చేసిన మొత్తం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారుతోంది. ఆ ఊళ్లో అబ్యర్థులు ఓటుకు నోటు ఎంత ఇచ్చారో అని తెలిస్తే అవాక్కు కాకా తప్పదు. సాధారణంగా ఎన్నికలు అన్నంతనే మద్యం.. డబ్బులు.. ఖరీదైన వస్తువులు ఇస్తూ.. ఓటర్లను తమవైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తుంటారు. అయితే.. ఇప్పటివరకు వినిపించిన ప్రలోభాలకు ఏ మాత్రం సంబంధం లేని రీతిలో ఓటర్లకు భారీగా ముట్టజెప్పిన వైనం ఒకటి తాజాగా వెలుగు చేసింది. ఇది.. ఏపీలో హాట్ టాపిక్ గా మారింది. అనధికారిక లెక్కల ప్రకారం ఓటుకు రూ. 40వేలు చొప్పున గిట్టుబాటు అయినట్లుగా చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలంలోని ఒక చిన్న గ్రామం ఉంది. అక్కడ ఓట్లు మొత్తం వెయ్యి లోపే. ఆ పంచాయితీని సొంతం చేసుకోవటానికి బరిలో ఉన్న పార్టీల మద్దతుదారులు భారీ ఎత్తున నోట్ల పంపిణీని షురూ చేశారు. సర్పంచ్ స్థానానికి పోటీ చేస్తున్న ఇద్దరు అభ్యర్థులు ఒకరికి మించి మరొకరు అన్నట్లుగా నగదు పంపిణీని మొదలు పెట్టి.. రూ. 10లకు ఫైనల్ చేశారు. దీంతో.. రెండు పార్టీల మద్దతుదారులైన అభ్యర్థులు ఒక్కో ఓటుకు రూ. 10వేల చొప్పున ఒక్కో ఓటుకు రూ. 20వేలు చొప్పున ఇచ్చారు. డిప్యూటీ సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్న మరో ఇద్దరు అభ్యర్థులు సైతం.. ఒక్కో ఓటుకు రూ. 10వేల చొప్పున ఇచ్చారు. అంటే.. ఉప సర్పంచ్ సైతం రూ. 20వేల చొప్పున రావటంతో.. మొత్తంగా ఓటుకు రూ. 40వేలు చొప్పున గిట్టుబాటు అయినట్లుగా చెబుతున్నారు. ఈ ఉదంతం జిల్లా వ్యాప్తంగానే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగానూ సంచలనంగా మారింది. ఓటుకు నలభైవేలా? అని నోరెళ్లబెడుతున్నారు.

# అన్నమాచార్య కళామందిరంలో శ్రీ పురందరదాసుల ఆరాధనా మహోత్సవాలు

**తిరుపతి, ఫిబ్రవరి 10 (ప్రజాపాలన) :** టిటిడి దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో కర్ణాటక సంగీత పితామహులు శ్రీ పురందరదాసుల ఆరాధనా మహోత్సవాలు బుధవారం తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల నుండి విచ్చేసిన 400 మందికిపైగా భజన మండళ్ల కళాకారులు శ్రీ పురందరదాస కీర్తనలనుచక్కగా ఆలపించారు. ఉదయం10 నుండి రాత్రి 8 గంటల వరకు బృందాల వారీగా కళాకారులు దాస పదాలను గానం చేశారు. దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి శ్రీ ఆనందతీర్థాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

**ఫిబ్రవరి 11న అలిపిరిలో పుష్పాంజలి :** ఆరాధనోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 11న గురువారం ఉదయం 6 గంటలకు అలిపిరి వద్దగల శ్రీ పురందరదాసుల విగ్రహానికి పుష్పమాల సమర్పిస్తారు. అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు హరిదాసరంజని కళాకారులతో సంగీత కార్యక్రమం, పండితుల ధార్మికోపన్యాసాలు, పురందరదాస సంకీర్తన విభావరి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

# దేశంలోకి అక్రమ చొరబాట్లు తగ్గాయి: కేంద్ర హోంశాఖ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ప్రజాపాలన) :** భారత్–బంగ్లాదేశ్ సరిహద్దుల గుండా దేశంలోకి అక్రమంగా చొరబడుతున్న వారి సంఖ్య 2020లో తగ్గిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రాజ్యసభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఇచ్చిన రాతపూర్వక సమాధానంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్.. బంగ్లా సరిహద్దుల గుండా 2016 నుంచి 2020 వరకు జరిగిన అక్రమ చొరబాట్ల వివరాలను వెల్లడించారు. నిత్యానంద్ రాయ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. 2016లో అక్రమ చొరబాట్లకు సంబంధించి మొత్తం 654 కేసులు నమోదు కాగా 1,601 మంది అరెస్టయ్యారు. 2017లో 456 కేసులు నమోదవగా 907 మందిని అదుపులోకి తీసుకున్నారు. 2018లో 420 కేసులు నమోదు కాగా 884 మందిని అరెస్ట్ చేశారు. 2019లో కేసులు 500, అరెస్టులు 1,109 రికార్డయ్యాయి. 2019తో పోల్చితే 2020లో మాత్రం చాలా తక్కువగా 489 కేసులు, 955 అరెస్టులు నమోదయ్యాయి.

# బెజవాడ టీడీపీ కోసం వెతుకులాట

**విజయవాడ, ఫిబ్రవరి 10, (ప్రజాపాలన) :** విజయవాడ టీడీపీ అధ్యక్ష పీఠంపై పార్టీలో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం విజయవాడ టీడీపీ అధ్యక్షుడిగా బుద్దా వెంకన్న ఉన్నారు. అయితే, బుద్దా పెర్ఫార్మెన్స్‌పై పార్టీలో లుకలుకలు వినిపిస్తున్నాయి. ఆయన వైఖరితో ఎవరూ కలవడం లేదు. అదే సమయంలో బుద్దా వెంకన్న కూడా అందరినీ కలుపుకొని ముందుకు సాగే ప్రయత్నం చేయడం లేదనేది వాస్తవం. అందుకే, కృష్ణా జిల్లా పార్టీలో ఉన్న కట్టుబాటు విజయవాడ నగరంలో మాత్రం కనిపించడం లేదు. దీంతో బుద్దా వెంకన్నను రీప్లేస్ చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇక, బుద్దా వెంకన్నను విజయవాడ టీడీపీ అధ్యక్షుడిగా ఇప్పటికే రెండోసారి కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే ఆయనను మార్చాలని అధిష్టానం కూడా చూస్తోంది. మాజీ మంత్రి దేవినేని ఉమాతో పాటు ఎంపీ కేశినేని నాని సైతం ఆయన్ను వ్యతిరేకిస్తున్నట్టు టాక్. నానికి, ఉమాకు గ్యాప్ ఉన్నా బుద్దా వెంకన్న విషయంలో మాత్రం వీరు ఒక్కటిగానే ఉంటున్నారట. ఈ క్రమంలో ఈ పదవి కోసం ముగ్గురు కీలక నాయకులు పోటీ పడుతున్నారని అంటున్నారు. వీరిలో ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన వంగవీటి రాధా, సెంట్రల్ నియోజకవర్గం నుంచి ఓడిపోయిన బొండా ఉమామహేశ్వరరావు, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అయితే, వీరితోపాటు మరికొందరు కూడా పోటీలో ఉన్నారని అంటున్నారు. ఇక, విజయవాడ నగర టీడీపీ అధ్యక్ష రేసులో ఉన్న నాయకుల్లో ఎంపీ కేశినేని వర్గంగా పేరు తెచ్చుకున్నవారికే అగ్రతాంబూలం దక్కుతుందనే ప్రచారం ఉంది. కేశినేని వర్గంలో ప్రస్తుతం ఉన్నది బొండా ఉమా ఒక్కరే. సో.. ఆయనకు ఇస్తారా? అనేది ప్రశ్నగా మారింది. ఇటీవల కాలంలో బొండా ఉమా ఓడిపోయినా కూడా పార్టీ తరపున గట్టి వాయిస్ వినిపిస్తున్నారు. ఫైర్ బ్రాండ్‌గా కూడా పేరు తెచ్చుకున్నారు. కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. నగరంలోని వ్యాపార వర్గాలతోనూ ఆయన సత్సంబంధాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆయనైతే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్త మవుతోంది. ఇక, ఇదే సామాజిక వర్గానికి చెందిన వంగవీటి రాధా కూడా ఈ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఖాళీగా ఉండడంతో ఈ పదవి కావాలని ఆయన కోరుతున్నారని అంటున్నారు. అదే సమయంలో చంద్రబాబు సామాజిక వర్గానికే చెందిన గద్దె రామ్మోహన్ రావు కూడా ఈ రేసులో ఉన్నా.. ఈ దఫా కాపులకు ఈ పదవి దక్కే అవకాశం ఉందని అంటున్నారు. మరి ఎవరిని ఈ పదవి వరిస్తుందో చూడాలి. కొసమెరుపు ఏంటంటే.. ఎవరు పగ్గాలు చేపట్టినా.. వచ్చే స్థానిక ఎన్నికలు పరీక్ష పెట్టనున్నాయనేది మాత్రం వాస్తవం.

# యడ్డీకి ఎదురుతిరుగుతున్నారా?



**బెంగళూర్, ఫిబ్రవరి 10, (ప్రజాపాలన) :** కర్ణాటకలో యడ్యూరప్ప తిరుగులేని నేత. ఆయనను కంటిన్యూ చేయడం వెనక అనేక కారణాలున్నాయని బీజే?పీలో పెద్ద యెత్తున చర్చ జరుగుతుంది. యడ్యూరప్ప వయసు రీత్యా పార్టీ నిబంధనల ప్రకారం ఆయనను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పిస్తారని అందరూ ఊహించారు. ఈ మేరకు ప్రచారం బాగా జరిగింది. ప్రత్యామ్నాయ నేత కోసం అన్వేషిస్తున్నట్లు కూడా వార్తలు వచ్చాయి. అయితే యడ్యూరప్పను కొనసాగిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకోవడం వెనక బలమైన కారణముందంటున్నారు. యడ్యూరప్పకు లాగానే త్వరలో ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షాలు సయితం 70వ పడిలో చేరబోతున్నారు. వారికీ ఈ నిబంధన వర్తిస్తుందని చెబుతున్నారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే మరోసారి ప్రధానిగా నరేంద్రమోదీ బాధ్యతలను చేపట్టాలని బీజేపీలో మెజారిటీ వర్గం కోరుకుంటుంది. అమిత్ షా కూడా కీలక బాధ్యతలను పోషించాలని ఆశిస్తుంది. వీరిద్దరి వల్లనే బీజేపీ దేశ వ్యాప్తంగా ఎదగగలిగిందని, మరికొంత కాలం వీరి సేవలు పార్టీకి, ప్రభుత్వంలో అవసరమని అభిప్రాయపడుతుంది. అది యడ్యూరప్పకు వరంగా మారినట్లు చెబుతున్నారు. వాస్తవానికి యడ్యూరప్పను అధికారంలో ఉన్నప్పుడే తప్పించాలని కేంద్ర నాయకత్వం భావించింది. రాష్ట్ర పార్టీ కూడా ఈ మేరకు సన్నద్ధమయిందంటారు. యడ్యూరప్పపై ఆరోపణలు కూడా ఉండటంతో ఆయనను పక్కన పెట్టాలని నిర్ణయించిదనే అంటారు. ఇందుకోసం మరో నేతను కూడా ఎంపిక చేశారని, వచ్చే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో యడ్యూరప్పతో సంబంధం లేకుండా వెళ్లాలన్నది అధిష్టానం యోచించింది. తమకు కూడా ఈ నిబంధన వర్తిస్తుందని పరోక్షంగా యడ్యూరప్ప కేంద్రనాయకత్వానికి చెప్పడం, తనను దించే ప్రయత్నం చేస్తే జేడీఎస్‌తో కలసి ముఖ్యమంత్రిగా కొనసాగుతానని స్పష్టంగా తెలియజేయడంతోనే యడ్యూరప్పను కంటిన్యూ చేశారని, మంత్రివర్గ విస్తరణకు అనుమతిచ్చా రని అంటారు. మరి యడ్యూరప్ప చెబుతుంది నిజమే కదా? వయసు రీత్యా తొలగించాలని చూస్తే, అదే నిబంధన అందరికీ వర్తిస్తుంది కదా? అన్నది బీజేపీలో చర్చనీయాంశ మైంది.

# ఏకపక్ష నిర్ణయాలతో తప్పని ఇబ్బందులు

**గుంటూరు, ఫిబ్రవరి 10, (ప్రజాపాలన) :** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఎప్పుడూ అప్ డేట్ అవుతానంటారు. డెబ్బయి ఏళ్ల వయసయినా 29 ఏళ్ల కుర్రాడిలా తన ఆలోచనలు ఉంటాయంటారు. వయసు పెరిగినా మనసు మాత్రం యంగ్ అని చెబుతుంటారు. కానీ చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలు పార్టీ నేతలకు తలనొప్పిగా మారాయి. ఔట్ డేటెడ్ నిర్ణయాలు తీసుకుని పార్టీని ఇబ్బంది పెట్టడమే కాకుండా, ప్రజల్లో చంద్రబాబు సయితం నవ్వుల పాలు అవుతున్నారు. పార్టీ నేతలకు ఇది అర్థమవుతున్నా ఆయనకు చెప్పలేని పరిస్థితి. ఒక రకంగా చెప్పాలంటే చంద్రబాబు ఇప్పుడు ఎవరు చెప్పినా వినే పరిస్థితిలో లేరంటున్నారు. సమావేశానికి వచ్చినా తాను అనుకుంది చెప్పి వెళ్తారు తప్పించి, సీనియర్ నేతల సలహాలు తీసుకోవడం కూడా ఇటీవల కాలంలో మానేశారని పార్టీ వర్గాలే బహిరంగంగా చర్చించుకుంటున్నాయి. ఇటీవల చంద్రబాబు స్వయంగా పంచాయతీ ఎన్నికల మ్యానిఫేస్టో ఇందుకు ఉదాహరణగా చెబుతున్నారు. చంద్రబాబు పంచాయతీ ఎన్నికల మ్యానిఫేస్టో విడుదల చేసి నవ్వుల పాలయ్యారు. పంచాయతీ ఎన్నికలకు ఎప్పుడూ ఇలాంటి మ్యానిఫేస్టోను ఏ పార్టీ విడుదల చేయలేదు. కానీ చంద్రబాబు మాత్రం ఫ్రస్టేషన్‌లో, ఏదో ఒకటి చేయాలని, జగన్ ప్రభుత్వాన్ని నిలదీయాలన్న ఉత్సాహంతో మ్యానిఫేస్టో విడుదల చేశారంటున్నారు. ఈ విషయంలో ఎవరినీ సంప్రదించకుండా చంద్రబాబు తీసుకున్న నిర్ణయంతో ఇప్పుడు పార్టీ ఇబ్బందుల్లో పడింది. వైసీపీకి ఆయుధంగా దొరికింది. ఇక తిరుపతి ఉప ఎన్నికల్లోనూ అభ్యర్థి విషయాన్ని ముందుగా ప్రకటించి చంద్రబాబు తప్పుచేశారంటున్నారు. పనబాక లక్ష్మిని మూడు నెలలు ముందుగా ప్రకటించి ఏం సాధించారని పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకూ ఆమె ప్రచారానికే శ్రీకారంచుట్టలేదని, ముందుగా ప్రకటించి చంద్రబాబు ప్రత్యర్థులకు భయం అనేది లేకుండా చేశారంటున్నారు. మొత్తం మీద చంద్రబాబు ఇటీవల కాలంలో తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదం కావడమే కాకుండా, పార్టీకి ఏమాత్రం ఉపయోగం లేకుండా పోతాయంటున్నారు. నలభై ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు ప్రజల్లో పలుచన కావడానికి ఆయన తీసుకున్న నిర్ణయాలే కారణమన్న కామెంట్స్ కూడా విన్పిస్తున్నాయి.

# ప్రేమ పెళ్లి చేసుకున్న నెలకే విషాదం.. తండ్రికి ఫోన్... కొద్దిసేపటికే దారుణం

**గుంటూరు ఫిబ్రవరి 10 (ప్రజాపాలన) :** మనసులు కలిసాయి. కానీ మతం వేరుచేసింది. ఇద్దరూ ప్రేమించుకున్నారు. తరువాత పెళ్లి చేసుకున్నారు. పెద్దలు అంగీకరించరన్న అనుమానంతో తనువులు చాలించాలనుకున్నారు. కూల్ డ్రింక్ లో విషం కలుపుకున్నారు. తాగి ఆత్మహత్యాయత్నం చేసారు. ఘటనలో భర్త మరణించాడు. భార్య పరిస్థితి విషమంగా మారింది. ఉండవల్లి గృహాలు వెనకాల కొండపైన ఓ జంట ఆత్మహత్య ప్రయత్నం ఘటన వెనుక ఈ విషాదం దాగిఉంది. యువకుడు వెండి దిండి పృథ్వీ ప్రకాశం జిల్లా హనుమంతులపాడు మండలంలోని చిన్నముప్పాళ్లపాడుకు గ్రామం వాసిగా గుర్తించారు. పృథ్వీ గతంలో తెనాలి, విజయవాడ ప్రాంతాల్లో పండ్ల వ్యాపారం చేశారు. తరువాత హైదరాబాద్ కు వెళ్లి జవహర్ నగర్ లో వ్యాపారం ప్రారంభించాడు. అక్కడ ఫర్హానా పరిచయం అయింది. తరువాత పరిచయం కాస్తా ప్రేమగా మారింది. జనవరిలో ఇద్దరూ కలిసి వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నారు. కూతురు కనిపించడంలేదని ఫర్హానా తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. మంగళవారం సాయంత్రం చిన్నముప్పాళ్లపాడులోని తండ్రికి పృథ్వీ ఫోన్ చేసి తాను ప్రేమించి, పెళ్లి చేసుకున్నానని.. కోడలును ఇంటికి తెస్తున్నానని చెప్పారు. పృథ్వీ తండ్రి ఆందోళన వ్యక్తం చేశారు. పల్లెటూరిలో ఆమెను తీసుకొస్తే పరువుపోతుందన్నట్లు కుమారుడికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. మరోవైపు పృథ్వీతో ఘర్హాన వెళ్లినట్లు గుర్తించిన ఆమె బంధువులు చిన్న ముప్పాళ్లపాడు చేరుకుని ఆరా తీశారు. పృథ్వీ, ఫర్హానాలు మంగళవారం ఉండవల్లి గుహల సమీపంలోని కొండపైకి వెళ్లారు. వారిని చూసిన అక్కడున్న కొందరు పిల్లలు ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పారు... ఈ జంట ఎంతసేపటికి కిందకు రాకపోవడంతో అనుమానంతో స్థానికులు కొండపైకి వెళ్లి చూశారు. వారిద్దరూ ఇద్దరు నురగలు కక్కుతూ పడి ఉండటం చూశారు. వెంటనే పోలీసులకు, 108 వాహన సిబ్బందికి సమాచారం ఇచ్చి ఇద్దరిని ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అప్పటికే పృథ్వీ చనిపోగా.. యువతి అపస్మారక స్థితిలో ఉండటంతో స్థానికులు కొండ పైనుంచి మోసుకొచ్చి అంబులెన్స్ లో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు మృతుడి జేబులో ఫోన్ నంబర్, ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులను గుర్తించారు. వాటి సాయంతో చిన్నముప్పాళ్లపాడులోని అతని తండ్రి గోపాలరెడ్డికి సమాచారం ఇచ్చారు. తనకు ఫోన్ చేసిన రెండు గంటల తర్వాత కొడుకు చనిపోయినట్లు తెలుసుకొని గోపాలరెడ్డి కన్నీళ్లు పెట్టుకున్నారు. ఫర్హాన కాళ్లకు మెట్టెలు ఉన్నాయని, ఇరువురూ పెళ్లి చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

# నో కామెంట్స్.. జగన్ వార్నింగ్

**విజయవాడ, ఫిబ్రవరి 10, (ప్రజాపాలన) :** ఏపీ ముఖ్యమంత్రి జగన్ అన్ని రకాలుగా అవమానాలను ఎదుర్కొంటున్నారు. తాను ప్రజల మద్దతుతో విజయం సాధించినప్పటికీ టీడీపీ నేతలు వ్యవస్థలను అడ్డం పెట్టుకుని తనను ఇబ్బంది పాలు చేయడం జగన్ సహించలేకపోతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసేంత వరకూ సంయమనం పాటించాలని జగన్ పార్టీ నేతలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. పంచాయతీ ఎన్నికల్లో ఎటూ వైసీపీదే ఆధిపత్యం ప్రదర్శిస్తుంది. అధికారంలో ఉండటంతో సహజంగా ప్రజలు కూడా అధికార పార్టీ వైపే మొగ్గు చూపుతారు. సో.. ఎన్నికల ఫలితాల గురించి పెద్దగా బెంగలేదు. ఇక నిమ్మగడ్డ రమేష్ కుమార్ ను అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు ఆడుతున్న డ్రామా మరికొంత కాలం కొనసాగుతుందని, వాటిని చూసీ చూడనట్లు వదిలేయడమే మంచిదని జగన్ సీనియర్ నేతలకు చెప్పినట్లు తెలిసి?ంది. మనం రెచ్చిపోయే కొద్దీ వారికి అనవసర పబ్లిసిటీ తప్ప మరేం ప్రయోజనం లేదని కూడా జగన్ వివరించారంటున్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మహా ఉంటే మరో రెండు నెలలు కొనసాగుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత మళ్లీ తెలుగుదేశం పార్టీ నేతలను జగన్ టార్గెట్ చేయనున్నారు. ఇప్పటికే కొందరు నేతలు భూ వివాదాల్లోనూ, వ్యాపార లొసుగులతోనూ ఉన్నారు. వారందరికీ స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత చుక్కలు చూపించాలన్నది జగన్ భావనగా ఉంది. ఇప్పటికే గొట్టిపాటి రవికుమార్ వంటి టీడీపీ నేతల వ్యాపారాలపై వరస దాడులు నిర్వహించారు. మరికొందరు వ్యాపారాలను నిలిపివేసుకున్నారు. ఇలా కాకుండా విశాఖ సిట్ రిపోర్ట్ అందిన వెంటనే చర్యలు తీసుకునేందుకు జగన్ ప్రభుత్వం సిద్ధమయింది. ఇందులో టీడీపీ ముఖ్యమైన నేతల పేర్లు ఉన్నట్లు చెబుతున్నారు. సిట్ నివేదిక మరో మూడు నెలల్లో ప్రభుత్వానికి అందనుంది. అప్పటికి స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ కూడా పూర్తవుతుంది. నిమ్మగడ్డ తలనొప్పి పోతుంది. విశాఖ భూ కుంభకోణంలో టీడీపీలో కీలకంగా వ్యవహరిస్తున్న నేతను జగన్ టార్గెట్ చేస్తారన్న ప్రచారం అయితే జోరుగా సాగుతుంది. ఎన్నికల తర్వాత టీడీపీ నేతలకు జగన్ చుక్కలు చూపించడం ఖాయమంటున్నారు.

# నిమ్మల ఫ్యూచర్ ప్లానింగ్



**అనంతపురం, ఫిబ్రవరి 10, (ప్రజాపాలన) :** అధికారంలో లేనప్పుడు సమిష్టిగా పనిచేస్తేనే భవిష్యత్‌లో విజయం వరిస్తుంది. అయితే వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే ఎత్తులు వేస్తున్న నేతలు మాత్రం తోటి పార్టీ నేతలతో సఖ్యతగా ఉండటం లేదు. ప్రధానంగా అనంతపురం జిల్లాలో టీడీపీ నేతల మధ్య విభేదాలు సమసి పోవడం లేదు. రోజురోజుకూ పెరిగిపోతూనే ఉన్నాయి. హిందూపురం మాజీ పార్లమెంటు సభ్యుడు నిమ్మల కిష్టప్ప ఇప్పుడు యాక్టివ్‌గా పెద్దగా లేకపోయినా వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే ప్లాన్ చేస్తున్నారు. ఆయన వరసగా పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేశారు. హిందూపురం పార్లమెంటు సభ్యుడిగా నిమ్మల కిష్టప్ప రెండుసార్లు విజయం సాధించారు. 2009, 2014 ఎన్నికల్లో పార్లమెంటు సభ్యుడిగా విజయం సాధించారు. 2019 ఎన్నికల్లోనే నిమ్మల కిష్టప్ప ఎమ్మెల్యేగా పోటీ చేయాలని విశ్వప్రయత్నం చేశారు. కానీ చంద్రబాబు అవకాశం ఇవ్వలేదు. 2019 ఎన్నికల్లో నిమ్మలకిష్టప్ప ఓడిపోయారు. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. అయితే ఇటీవల కాలంలో నిమ్మల కిష్టప్ప యాక్టివ్ అయ్యారు. అయితే ఆయన హిందూపురం పార్లమెం టు స్థానం కంటే శాసనసభ స్థానాలపైనే ఎక్కువ దృష్టి పెట్టారు. ఆయన ఎక్కువగా పుట్టపర్తి, పెనుకొండ నియోజకవర్గాలపైనే ఆసక్తి కనపరుస్తున్నా రు. పెనుకొండలో బలమైన నేత ఉన్నారు. బీకే పార్థసారథి కూడా 2009, 2014 ఎన్నికల్లో గెలిచి పట్టు సంపాదంచారు. ఆయనను తట్టుకుని నిలబ డం నిమ్మల కిష్టప్పకు కష్టమే. అందుకే నిమ్మల కిష్టప్ప చూపంతా ఇప్పుడు పుట్టపర్తి నియోజ కవర్గంపైనే ఉంది. ఇక్కడ టీడీపీ సీనియర్ నేత పల్లె రఘునాథరెడ్డి ఉన్నప్పటికీ ఆయన ఆరోగ్య కారణాల రీత్యా బయటకు రావడం లేదు. ఈసారి చంద్రబాబు పల్లెను పక్కన పెడతారన్న ప్రచారం ఉంది. అం దుకే నిమ్మల కిష్టప్ప కాన్సంట్రేషన్ అంతా పుట్టపర్తి నియోజకవర్గంపైనే పెట్టారంటున్నారు. దీంతో అక్కడ రెండు గ్రూపులు బయలుదేరాయి. ఈ సారి ఎన్నికల్లోనైనా నిమ్మల కిష్టప్ప ఆశనెరవేరుతుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

# దినకరన్ ప్లాన్ అదేనా?

**చెన్నై, ఫిబ్రవరి 10, (ప్రజాపాలన) :** తమిళనాట ఎన్నికలకు సమయం దగ్గర పడింది. శశికళ కూడా జైలు నుంచి విడుదలయ్యారు. దినకరన్ ప్రారంభించిన అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం పార్టీని అంత సులువుగా తీసివేయడానికి వీలులేదు. ఇది ఈ ఎన్నికల్లో ప్రభావం చూపుతుందన్న అంచనాలు ఉన్నాయి. అన్నాడీఎంకేలో ఉన్న కూటమి పార్టీలకంటే దినకరన్ పార్టీకి పట్టుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అందుకే శశికళను అన్నాడీఎంకేలోనైనా చేర్చుకోవాలని, లేకుంటే దినకరన్ పార్టీతో పొత్తు అయినా పెట్టుకోవాలని అన్నాడీఎంకే అధినేతలపై వత్తిడి పెరుగుతుంది. శశికళ ఒక ప్రభావమంతమైన నేత అని ఇప్పటికీ అందరికీ అంగీకరిస్తారు. ఆమె మేనల్లుడు దినకరన్ పార్టీ ఈ ఎన్నికలలో ఓట్లను గణనీయంగా చీల్చగలదని భావిస్తున్నారు. శశికళ జైలులో ఉండగానే జరిగిన మొన్న పార్లమెంటు ఎన్నికల్లో దినకరన్ పార్టీ ఆరు శాతం ఓట్లను సాధించింది. ఒంటరిగా పోటీ చేసి శశికళ లేకుండా ఆరు శాతం ఓట్లను సాధించడాన్ని తక్కువగా అంచనా వేయకూడదని పార్టీ నేతలు సయితం అంగీకరిస్తున్నారు. శశికళ ఆర్థికంగా కూడా బలమైన నేత కావడంతో ఈ ఎన్నికల్లో కనీసం పదిహేను శాతం ఓట్లను పొందే అవకాశాలున్నాయంటు న్నారు. అదే జరిగితే అధికార అన్నాడీఎంకేకు ఇబ్బంది తప్పదు. శశికళను పార్టీలో చేర్చుకోకపోయినా ఆ పార్టీకి బలం ఉన్న ప్రాంతాల్లో సీట్లను కేటాయిస్తే బాగుంటుందన్న సూచనలు అన్నాడీఎంకేలో విన్పిస్తున్నాయి. దినకరన్ సయితం అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు, మంత్రులతో టచ్ లోకి వెళ్లినట్లు చెబుతున్నారు. అన్నాడీఎంకేలో పోటీ చేసే అభ్యర్థులతో ముందు గానే టచ్ లో ఉండి వారికి ఆర్థిక సాయం అందించేందుకు కూడా దినకరన్ ప్లాన్ చేశారని సమాచారం. గెలిచిన తర్వాత తమను అన్నాడీఎంకేలో చేర్చుకునే విధంగా అన్నాడీఎంకే అధినేతలపై వత్తిడి తెచ్చే కార్యక్రమాన్ని కూడా చేయాలన్నది దినకరన్ వ్యూహంగా ఉంది. అన్నాడీఎంకే నుంచి పోటీ చేసినా కొందరికి శశికళ, దినకరన్ ఆశీస్సులు అన్ని విధాలుగా అందే అవకాశాలున్నాయని, భవిష్యత్ లో పార్టీని తమ చేతుల్లోకి తీసుకొచ్చేందుకే దినకరన్ ఈ కొత్త ఎత్తుగడ వేశారంటున్నారు. మరి దినకరన్ ప్లాన్ ఫలిస్తుందో? లేదో? చూడాలి.

# నష్టాలకు కారణం ఎవరు...?

**విశాఖపట్టణం, ఫిబ్రవరి 10, (ప్రజాపాలన) :** లాభాల్లో ఉన్న వైజాగ్ స్టీల్‌కు నష్టాలు ఎందుకు వచ్చాయి. ఆ తర్వాత ఎందుకు కోలుకోలేకపోయింది. అసలు స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయాలనే నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చింది. ప్రైవేటు చేతుల్లో పెట్టకుండా సంస్థను బాగు చేయలేమా..? ఒకప్పుడు 10, 20 శాతం డిజిన్వెస్ట్‌మెంట్ అంటూ భయపెట్టిన కేంద్రం.. ఈసారి వ్యూహాత్మక వందశాతం షేర్ల అమ్మకం అంటూ స్టేట్‌మెంట్ ఇచ్చేసింది. స్టీల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ అంటూ ఎప్పటినుంచో ప్రచారం జరుగుతున్నా? కార్మికులు, రాజకీయ పార్టీల పోరాటం ఆ ప్రయత్నాలకు అడ్డం పడింది. కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం విశాఖ నగరాన్ని ఉలిక్కిపడేలా చేసింది. దేశంలోని వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులు ఉపసంహరిస్తామని కేంద్రం ప్రకటించింది. దీనిద్వారా లక్షా 75వేల కోట్లు సమీకరించుకోవాలని ఆర్థికశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇదే విషయాన్ని.. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ కూడా బడ్జెట్ సమయంలో ప్రకటించారు. ప్రైవేటీకరణ ద్వారా యాజమాన్య హక్కులతో పాటు, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ ఆర్ఐఎన్ఎల్‌లో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వంద శాతం షేర్‌హోల్డింగ్‌ను ఉపసంహరించుకోవడానికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ జనవరి 27న ఆమోదముద్ర వేసింది. ఒకప్పుడు భారీ నష్టాల్లో కూరుకుపోయిన విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ ఆ తర్వాతి కాలంలో? తేరుకొని 21వేల 851 కోట్ల టర్నోవరు సాధించే స్థాయికి చేరింది. నాలుగేళ్లలో 203.6 శాతం వృద్ధి సాధించింది. మొదట లాభాలు ఆర్జించినా.. ఆ తర్వాత వైజాగ్ స్టీల్ ఫ్యాక్టరీ నష్టాల బాటలో నడవడానికి సొంత గనులు లేకపోవడమే ప్రధాన కారణం. కొన్నేళ్లుగా బహిరంగమార్కెట్‌లో ఐరన్ ఓర్, బొగ్గు ధరలు పెరగడంతో 4వేల కోట్ల భారాన్ని స్టీల్ ఫ్యాక్టరీ మోయాల్సి వచ్చింది. ఆధునికీరణ, విస్తరణ చేపట్టడంతో పెద్దఎత్తున ఆర్థిక ఒత్తిడి ఎదుర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉక్కు ప్లాంటు ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేసేందుకు కేంద్రం సిద్ధమైంది. ఏటా 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నడుస్తున్న ప్లాంట్? 2030 నాటికి 20 మిలియన్ టన్నుల విస్తరణకు సిద్ధమవుతోంది. సంస్థ పెట్టినప్పటి నుంచి 2020 డిసెంబర్ వరకు 200 కోట్లు నికర లాభాన్ని ఆర్జించింది. ఉక్కు ఉత్పత్తిని పెంచడానికి ఈ ప్లాంట్ ఫిబ్రవరి 2020 నుంచి మూడు బ్లాస్ట్ ఫర్నేసులతో పనిచేస్తోంది. ఇలాంటి సమయంలో పరిశ్రమను మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోకపోగా.. ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఘన చరిత్ర ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్.. 2015 నుంచి వరుస నష్టాల్లో కూరుకుపోయింది. 2015-16లో 1420.64 కోట్లు, 2016-17లో 1263.16 కోట్లు, 2017-18లో 1,369.01 కోట్ల నష్టం చవిచూసింది. సొంత గనులు లేకపోవడమే నష్టాలకు కారణమని పార్లమెంట్ స్థాయి సంఘం కూడా నిర్ధారించింది. ఆ నష్టాల కారణంగానే కేంద్రప్రభుత్వం దీన్ని పూర్తిగా ప్రైవేటుకు అప్పగించేందుకు సిద్ధమైంది. మార్కెట్ పరిస్థితులు, చైనా నుంచి వచ్చే చౌక దిగుమతులు, నష్టాలకు ప్రధాన కారణంగా చెబుతుండేవారు. వరుసగా మూడేళ్లు నష్టాలు చవిచూశాక.. 2018-19 ఆర్థిక సంవత్సరంలో 97 కోట్ల లాభం సంపాదించింది. విస్తరించిన యూనిట్ల నుంచి ఉత్పత్తిని పెంచి, మార్కెట్‌ను మెరుగుపరుచుకుంది. కానీ 2019-20 ఆర్థిక సంవత్సరంలో.. 3 వేల కోట్లకు పైగా నష్టం చవిచూసింది. ఇక సొంత గనులు లేకపోవడంతో.. విశాఖ ఉక్కు కర్మాగారానికి కావాల్సిన ముడి సరుకునంతా బయటినుంచి కొనాల్సి వస్తోంది. ముడి ఇనుము ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో.. భారీ మొత్తాలు వెచ్చించి కొనుగోలు చేయడం అనివార్యంగా మారింది. దేశంలో మేలైన బొగ్గు లభించకపోవడంతో.. విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. అలాగే ముడి ఇనుమును చత్తీస్‌గఢ్, ఒడిశా నుండి తెప్పిస్తున్నారు. రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా కుకునూరు ప్రాంతంలో సుమారు 30 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం లభించే గనులున్నాయి? వాటిని విశాఖ స్టీల్ ఫ్యాక్టరీకి కేటాయిస్తే? నష్టాల నుంచి లాభాల వైపు మళ్లే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. నిర్వహణ వ్యయం పెరుగుతుండటంతో? విశాఖ స్టీల్ ప్లాంటును లాభాల బాటలో నడపడానికి మెకెన్సీ సంస్థను కన్సల్టెంటుగా పెట్టుకొన్నారు. వాళ్ల సూచనలు పాటిస్తే నష్టాల నుంచి బయట పడుతుందని అంతా భావించారు. దేశంలో.. స్టీలుకు డిమాండ్ పెరగటంతో.. భవిష్యత్తు ఇకపై బాగానే ఉంటుందనుకున్నారు. కానీ.. ఇంతలోనే కేంద్రప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను వందశాతం అమ్మేసేందుకు సిద్ధమైంది. డిజిన్వెస్ట్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఆర్ఐఎన్ఎల్ నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకోవాలని, ప్రైవేటుపరం చేయాలనే నిర్ణయానికి కేంద్రం వచ్చినట్లు స్పష్టమౌతోంది. కేంద్రం నిర్ణయంతో ఉక్కునగరం ఉలిక్కిపడింది. ఉద్యమబాట పట్టింది. ప్రైవేటీకరణ ప్రతిపాదనను వెనక్కి తీసుకోకపోతే.. ఎంతటి పోరాటానికైనా సిద్ధమని కార్మికులు హెచ్చరిస్తున్నారు. ఇక అటు రాజకీయంగానూ ఈ వ్యవహారం రచ్చ

# ముందుకు సాగని వర్మీ కంపోస్ట్ పనులు

**రాజమండ్రి, ఫిబ్రవరి 10, (ప్రజాపాలన) :** కొత్తనీరు వస్తే పాత నీరు పోతుందనే సామెతలా ఉంది ప్రభుత్వ పథకాల పనితీరు. చెత్త ద్వారా సంపద తయారీ అంటూ అనేక విధాలుగా ప్రచారం నిర్వహించి, హడావుడి చేసి చివరికి పథకాన్ని మూన్నాళ్ల ముచ్చటగా ముగించారు. లక్షలాది రూపాయలు షెడ్లు తయారీకి ఖర్చుచేసినా ఫలితం లేకుండా పోయింది. గ్రామ పంచాయతీల ఆదాయం పెంచేందుకు, గ్రామంలో సేకరిస్తున్న చెత్తను పారపోయకుండా, వినియోగించి వర్మికంపోస్టు తయారు చేసి అమ్మకాలు సాగించేందుకు ఈ పథకం ప్రారంభమైంది. తడి చెత్త ద్వారా వస్తున్న పశువుల పేడ, మిగిలిన అన్నం, కూరలు, మాంసం పదార్థాలు, పువ్వులు, కొబ్బరి పీచు, కూరగాయ తొక్కలు, పెరడు, పంట నుండి వచ్చే ఆకులు, మొక్కలు, పండ్ల తొక్కలు, పచ్చగడ్డి, ఎండుగడ్డి తదితర తడి చెత్తను వేరుగా సేకరించి వీటికి పేడ కలిపి ఉంచిన తరువాత వర్మీకంపోస్టు తయారు అవుతుంది. ఈ ఎరువును కావాల్సిన వారికి



విక్రయించి, తద్వారా పంచాయతీ ఆదాయం పెంచుకునేందుకు ఈ పథకం ఉద్దేశించబడింది. సుమారు ఏడాది క్రితం మండల పరిషత్ సిబ్బందితోపాటు గ్రామ కార్యదర్శులకు షెడ్లు నిర్మాణం పథకం ఏర్పాటుపై తరచూ సమావేశాలు నిర్వహించడంతోపాటు, లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించింది. కొద్దికాలం పాటు ఈ పథకానికి సంబంధించి అధికారులు ఉరుకులు, పరుగులు తీశారు. కొద్దికాలం తరువాత వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పథకం అడుగుపెట్టడంతో పాత పథకమైన చెత్త ద్వారా సంపద తయారీని మరిచిపోయారు. మాడుగుల మండలంలో మాడుగుల, విజెపురం గ్రామాలలో మాత్రం ఈ పథకం కింద షెడ్లను నిర్మించారు. ఉపాధి హామీ పథకం ద్వారా షెడ్ల నిర్మాణానికి నిధులు విడుదల కావాల్సివుండగా, మిగిలిన గ్రామాలలో షెడ్లు నిర్మించేందుకు నిధులు లేవని ఉపాధి కార్యాలయం చేతులెత్తేయడంతో పథకం పూర్తిగా నిలిచిపోయింది. పోనీ షెడ్లు నిర్మాణమైన రెండు గ్రామాల్లోనూ వర్మికంపోస్టు తయారు అవుతుందా? అంటే అదీలేదు. మాడుగులలో షెడ్లు నిర్మాణానికి రూ.6 లక్షలతో ప్రణాళిక వేయడం జరిగింది. కేవలం రూ.3లక్షల 50వేలతో షెడ్డు నిర్మాణం పూర్తయిందనిపించారు. ఇదీ కూడా నిర్మాణం పూర్తయి ఏడాది అవుతున్నా ఇప్పటివరకు ఎరువుల తయారీ ప్రారంభం కాలేదు. షెడ్డు నిర్మాణానికి సైతం ఆరు నెలల సమయం పట్టింది. ఈ షెడ్డును ప్రైవేటు అవసరాల కోసం ఎవరైనా నిర్మిస్తే కేవలం వారం రోజులలో పూర్తిచేయవచ్చు. కానీ ప్రభుత్వ పనితీరు ఏ విధంగా ఉందో చూసేందుకు మాడుగుల షెడ్డు నిర్మాణం ఒక ఉదాహరణగా నిలుస్తుంది. షెడ్ల నిర్మాణానికి ఉపాధి సిబ్బంది ముందుకు రావడం లేదని, ప్రజాప్రతినిధులు అనేక సమావేశాలలో అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా మిగిలిన గ్రామాల్లో షెడ్లు నిర్మాణం కాలేదు. పూర్తయిన షెడ్లలో ఎరువుల తయారీ చేపట్టలేదు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వడం అవసరమే అయినా, ఈ పథకం వచ్చేసరికి, పాత పథకానికి మంగ ళం పాడారు. అనేక పర్యాయాలు సమావేశాలు, సభలు, నిర్మాణం అయిన వాటికి ఖర్చు చూస్తే.. సమయంతో పాటు, ప్రభుత్వ సొమ్ము కూడా వృధా అయింది. వర్మికంపోస్టు తయారు అయ్యేందు కు అవసరమైన పేడను మొదట కొనుగోలు చేయమని ఉన్నతాధికా రులు ఆదేశాలు జారీ చేశారు. తరు వాత కొద్ది రోజులకు కొనుగోలు చేయవద్దని ఆదేశాలు జారీ చేశారు. ఇటువంటి ఆదేశాల గందరగోళాల మధ్య ఈ పథకం పూర్తిగా నిలిచిపో యింది. అసలు ఈ పథకం ఎందు కు పెట్టారో, ఎందుకు పూర్తిచేయ లేదో అధికారులకే అర్థం కాకుండా ఉంది. ఫలితంగా లక్షలాది రూపా యల ప్రజాధనం వృధా అయింది. రాష్ట్రంలో పథకాల అమలు ఎలా ఉన్నా, పథకం అమలు అయినా లేకున్నా, ప్రచారాలు, ఆర్భాటాల కోసమే సమయాన్ని కేటాయిస్తున్నా రనే వాదన వినిపిస్తుంది. పంచాయ తీలు ఆసక్తి చూపాలి. చెత్త ద్వారా సంపద తయారీ కేంద్రాలపై గ్రామ పంచాయతీలు ఆసక్తి చూపాలి. తద్వారా వచ్చే ఆదాయం పంచాయ తీలకు చెందుతుంది. వాటిపై ఆయా గ్రామపంచాయతీలు దృష్టిసారిం చాలి. మండలంలో మాడుగుల, విజెపురం గ్రామాలలో షెడ్లు నిర్మాణమైనా, మిగిలిన పంచాయతీలలో స్థలాల సమస్యతో పాటు, బిల్లు లు మంజూరు కావనే అపోహలు కారణంగా కాంట్రాక్టర్లు వెనుకడుగు వేస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతా ధికారులకు సమాచారం అందిస్తా మన్నారు.

# 70 వేల కోట్ల స్టీల్ ప్లాంట్

**విశాఖపట్టణం, ఫిబ్రవరి 10, (ప్రజాపాలన) :** తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. అందుకు కారణాలేంటి? అప్పులు.. దానికయ్యే వడ్డీలే ఉక్కు పరిశ్రమకు గుదిబండలా మారాయా? ఇప్పటికిప్పుడు లాభాల బాట పట్టాలంటే విశాఖ స్టీల్ కంపెనీ కోసం కేంద్రం ఏం చేయాలి? అసలు స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న ఆస్తులెన్ని.. అప్పులెన్ని..? విశాఖ ఉక్కు పరిశ్రమ నష్టాల్లో పడడానికి అనేక కారణాలున్నాయ్. సొంత ఐరన్ ఓర్, బొగ్గు గనులు లేనందువల్ల వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కి ఉత్పత్తి వ్యయం ఎక్కువ అవుతుంది. అంతేకాక, భారీ రుణభారం, ఆ రుణాల మీద ఉన్న వార్షిక వడ్డీ ఉక్కు కర్మాగారానికి పెనుభారంగా మారింది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఆస్తుల విలువ 35,222 కోట్ల రూపాయలు. కంపెనీ ఆధీనంలో ఉన్న 19 వేల ఎకరాలకు పైగా ఉన్న భూముల ప్రస్తుత మార్కెట్ విలువను పరిగణలోకి తీసుకోకుండానే చూస్తే కనిపిస్తున్న ఆస్తుల విలువ అది. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకూ 4,889 కోట్ల రూపాయలను మూలధనం పెట్టుబడిగా పెట్టింది. 2020 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు 11,338 కోట్ల రూపాయల అప్పు ఉంది. ఈ అప్పు మీద ప్రతీ ఏటా అయ్యే వడ్డీ భారం వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఆయువు తీస్తుంది. 2020 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి వైజాగ్ స్టీల్ ప్లాంట్ 15,966 కోట్ల టర్నోవర్ సాధించింది..గడిచిన ఆర్థిక సంవత్సరానికి ఉద్యోగుల జీత భత్యాల కోసం 2,662 కోట్ల రూపాయలు అవసరమైంది. వడ్డీ చెల్లింపుల కోసం 1,519 కోట్ల రూపాయలు ఖర్చయ్యింది. ఇక తరుగుదల కోసం 1,111 కోట్ల రూపాయలను కేటాయించింది కేంద్రం. వీటితో పాటు ఇతర ఉత్పత్తి వ్యయాలన్నింటినీ పరిగణలోకి తీసుకుంటే గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థకు 4,021 కోట్ల నికర నష్టం వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు వచ్చింది. అంతకుముందు సంవత్సరంలో వచ్చిన నికర నష్టం 412 కోట్లు మాత్రమే. మార్కెట్ పరిస్థితులు అంత ఆశాజనకంగా లేక, టర్నోవరు క్షీణించడం, మరోవైపు స్టీలు ఉత్పత్తికి వాడే ముడిసరుకు ఖర్చులు పెరగడం వల్లే .. 2019-20 ఆర్థిక సంవత్సరంలో నష్టాలు వచ్చాయ్..ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైజాగ్ స్టీల్ ప్లాంట్ విషయమై ప్రధానమంత్రికి రాసిన లేఖలో ప్రస్తావించినట్లుగా.. సంస్థ రుణాల్లో సగమైన మూలధన వాటాగా మార్పు చేసి, మిగిలిన అప్పులపై వడ్డీరేటును తగ్గిస్తే ఇతర ప్రభుత్వరంగ సంస్థల మాదిరిగా.. సొంత ఇనుప ఖనిజం, బొగ్గు గనులు కేటాయిస్తే.. వైజాగ్ స్టీల్ ప్లాంట్ లాభాల్లో నడవడం ఖాయం. గత డిసెంబరు నెలలో వైజాగ్ స్టీల్ ప్లాంట్ సాధించిన పనితీరు గమనిస్తే.. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను లాభదాయకంగా నడపడం సాధ్యమేనని రుజువవుతోంది. 2020 డిసెంబరు నెలలో.. వైజాగ్ స్టీల్ ప్లాంటు 98 శాతం ఉత్పత్తితో పని చేసి 2,100 కోట్ల రూపాయల టర్నవర్‌ను, 170 కోట్ల రూపాయల నికర లాభాన్ని అర్జించింది. గడిచిన 29 నెలల్లో ఇంత మంచి పనితీరు కనబర్చడం ఇదే ప్రథమం.. ఆశాజనకం కూడా. ఇతర ప్రభుత్వరంగ స్టీల్ కంపెనీల్లాగా.. సొంత ఇనుప ఖనిజం , బొగ్గు గనులు ఉంటే ఈ లాభాలు ఇంకా పెరిగేవి. ఏడాదికి 63లక్షల టన్నుల స్టీలు ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉన్న వైజాగ్ స్టీల్‌కు నాణ్యతా పరంగా మంచి గుర్తింపు ఉంది. ఇతర కంపెనీల స్టీలు ఉత్పత్తులతో పోలిస్తే.. వైజాగ్ స్టీల్‌కు ప్రీమియం ధర లభిస్తుంది. స్టీల్ ఉత్పత్తుల మార్కెట్ ఇప్పుడిప్పుడే మెరుగవడం కూడా వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు కలిసొచ్చే కాలం.


## పెళ్లిరోజు.. మహేష్‌బాబుకు నమ్రత స్వీట్ గిఫ్ట్!



'ఏ కంప్లీట్ ఫ్యామిలీ మెన్' అనే పదానికి ఉదాహరణ కావాలంటే.. సూపర్స్టార్ మహేష్ బాబును చూపిస్తే సరిపోతుంది. కెరీర్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ.. కుటుంబానికి ఆయన కేటాయించే సమయం చాలా గొప్పగా ఉంటుంది. ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా.. ఫ్యామిలీకి క్వాలిటీ టైంను కేటాయిస్తాడు ప్రిన్స్. భార్య పిల్లలతో కలిసి వీలు కుదిరినప్పుడల్లా విహార యాత్రలకు కూడా వెళుతుంటాడు మహేష్. కుటుంబ సభ్యులు సైతం.. మహేష్ ను కూడా అలాగే చూస్తారు. అందుకే.. టాలీవుడ్లోని అత్యంత అన్యోన్యమైన జంటగా మహేష్-నమ్రత నిలిచారు. వీరు ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారు. కాగా.. బుధవారం వీరి వివాహ వార్షికోత్సవం. ఈ సందర్భంగా నమత్ర సోషల్ మీడియా ద్వారా మహేష్కు విషెస్ చెప్పారు. ఈ సందర్భంగా తన భావోద్వేగాన్ని మాటల్లో వ్యక్తం చేశారు. '16 ఏళ్లు చాలా సులభంగా గడిచిపోయాయి. బలమైన ప్రేమ నమ్మకం విశ్వాసం కలయికతో మన వైవాహిక జీవితం రూపుదిద్దుకుంది. వివాహ వార్షికో త్సవ శుభాకాంక్షలు మహేష్ బాబు. నిన్ను మరింత ఎక్కువగా ప్రేమిస్తున్నాను' అని నమ్రత ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ కు మహేష్ను ముద్దు పెట్టుకుంటున్న ఫొటోను కూడా షేర్ చేశారు నమ్రత. ఇప్పుడు ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నెటిజన్లు ఈ జంటకు విషెస్ తెలియజేస్తున్నారు.

## బడా డైరెక్టర్.. పవర్ స్టార్ మూవీలో స్పెషల్ రోల్ చేస్తున్నాడా?

గతేడాది మలయాళంలో విడుదలై బ్లాక్ బస్టర్ అందుకున్న చిత్రం 'అయ్యప్పనుమ్ కోషియం'. ఈ సినిమా ఇప్పుడు తెలుగులో నిర్మాత సూర్యదేవర నాగవంశీ రీమేక్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఎప్పుడో తెలుగు రీమేక్ రైట్స్ సొంతం చేసుకున్నారు కానీ ఇంతవరకు సినిమా పూర్తికాలేదు. ముఖ్యంగా ఇద్దరు వ్యక్తుల చుట్టూనే తిరిగే ఈ సినిమాలో మద్యానికి బానిసైన ఒక రిటైర్డ్ హవాల్దారుకి అతన్ని అరెస్ట్ చేసిన పోలీస్ అధికారికి మధ్య బలమైన ఇగోల చుట్టూ ఈ కథాంశం సాగుతుంది. ఈ సినిమాలో పోలీస్ అయ్యప్పన్ పాత్రలో బిజుమీనన్ కోషి పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించాడు.



అయితే తెలుగు రీమేక్ లో పృథ్వీరాజ్ పాత్రలో రానా అయ్యప్పన్ పాత్రలో పవన్ కళ్యాణ్ నటించనున్నారు. ఇటీవలే పూజా కార్యక్రమం ముగించుకున్న ఈ సినిమా షూటింగ్ ప్రారంభ దశలో ఉంది. సాగర్ కే. చంద్ర దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు త్రివిక్రమ్ స్క్రీన్ ప్లే డైలాగ్స్ రాసారు. ఈ సినిమాలో రానా భార్య పాత్రలో ఐశ్వర్యరాజేష్ ఓకే అయింది. అయితే ఇంకా పవన్ కళ్యాణ్ భార్య పాత్రలో ఎవరు నటిస్తారనేది తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా తాజాగా ఏకే రీమేక్ లో ఓ క్యారెక్టర్లో ప్రముఖ డైరెక్టర్ నటిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. డైరెక్టర్ వివి వినాయక్ ఈ సినిమాలో ఓ స్పెషల్ క్యారెక్టర్ పోషించనున్నట్లు తెలుస్తుంది. ఎందుకంటే ఆయనకు యాక్టింగ్ మీద ఇంటరెస్ట్ ఉంది అనే విషయం తెలిసిందే. ఇదివరకు ఠాగూర్ శీనయ్య సినిమాలలో నటించాడు. అయితే ఇప్పుడు పవన్ కళ్యాణ్ సినిమాలో నటిస్తారనే వార్తకు చిత్రబృందం నుండి జవాబు రావాల్సి ఉంది. అధికారిక ప్రకటన వచ్చేవరకు వెయిట్ చేయాల్సిందే. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు ప్రసాద్ మూరెళ్ల సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపడుతున్నారు.

## 80లలో శ్రీదేవి ఫ్యాషన్‌నే జాన్వీ ఫాలో చేస్తోందా?



అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలు జాన్వీ కపూర్ మామ్ ఆశల్ని వమ్ము కానివ్వకుండా సినీప్రపంచంలో కథానాయికగా దూసుకుపోతోంది. అయితే నాటి మేటి ఫ్యాషనిస్టాగా శ్రీదేవి వారసత్వాన్ని కూడా జాన్వీ నిలబెడుతోందా? అంటే అవుననే ఫ్యాన్స్ అంటున్నారు. ఇటీవలి కాలంలో జాన్వీ ఫోటోషూట్లు కాస్ట్యూమ్ సెలెక్షన్ పరిశీలిస్తే.. నాటి రోజుల్లో శ్రీదేవి సెలక్షన్ కి నియరెస్ట్ గా ఉందనే కామెంట్లు అభిమానుల్లో వినిపిస్తున్నాయి. ఓల్డ్ డేస్ గోల్డెన్ డేస్ అన్న చందంగా నాటి స్టైలింగ్ ఇప్పటికీ సజీవంగానే ఉంది అంటే జాన్వీ లాంటి నవతరం నాయికలు ఇప్పటికీ ఆ ట్రెండ్ ని ఇష్టపడుతున్నారు కాబట్టే. తాజాగా జాన్వీ ధరించిన పింక్ పర్పుల్ ఫ్రాకు లేటెస్ట్ మోడల్ కానేకాదు. 80లలో శ్రీదేవి ధరించిన స్పెషల్ చిక్ డ్రెస్ అన్నది ఫ్యాన్స్ ఇట్టే గుర్తు పట్టేస్తున్నారు. ఆ రోజుల్లోనే శ్రీదేవి.. భానుప్రియ.. రాధ అద్భుతమైన డిజైనర్ డ్రెస్సుల్లో మెరిసిపోయేవారు. నేటితరానికి సీనియర్ నాయికలు స్ఫూర్తిగా నిలుస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. ముఖ్యంగా సమకాలీన కథానాయికల్లో శ్రీదేవి బెస్ట్ ఫ్యాషనిస్టాగా రాజ్యమేలారు. అప్పట్లో బ్లాక్ బస్టర్ ఇంక్విలాబ్-1984 (అమితాబ్ హీరో) చిత్రంలో శ్రీదేవి పింక్ ఫ్రాక్ సంథింగ్ స్పెషల్ గా ఆకట్టుకుంది. ఇప్పుడు ఆ వారతస్వాన్ని జాన్వీ కాపాడుతోందనే అభిమానులు భావిస్తున్నారు. కెరీర్ విషయానికి వస్తే.. ధడక్ చిత్రంతో రంగ ప్రవేశం చేసి కార్గిల్ గర్ల్ వరకూ నటవారసురాలు జాన్వీ ప్రయాణం ఎంతో ఎగ్జయిటింగ్ గానే సాగింది. ఇపుడు దోస్తానా 2 - రూహీ అఫ్జా లాంటి క్రేజీ చిత్రాల్లో జాన్వీ నటిస్తోంది. 2021-22 సీజన్ లో ఈ చిత్రాలన్నీ రిలీజ్ కానున్నాయి. దిల్లీలో పంజాబ్ రైతుల నిరసనల వల్ల జాన్వీ నటిస్తున్న జగ్ జగ్ జియో షూటింగ్ కి బ్రేక్ పడిన సంగతి తెలిసిందే.

## ప్రభాస్ మూవీలో 'మార్షల్ ఆర్ట్స్'.. ఫైట్ కోసమేనా??



బాహుబలి సినిమాతో పాన్ ఇండియా స్టార్ అయిన డార్లింగ్ ప్రభాస్.. ఆ తర్వాత నుండి చేస్తున్న సినిమాలన్ని పాన్ ఇండియా సినిమాలే. సాహెూ తర్వాత జిల్ ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో 'రాధేశ్యామ్' కంప్లీట్ చేసాడు. ఇటీవలే షూటింగ్ ముగించుకున్న రాధేశ్యామ్ పీరియాడిక్ లవ్ స్టోరీగా రూపొందింది. ఈ సినిమా తర్వాత ప్రభాస్.. ప్రభాస్ సలార్ అనే మాస్ యాక్షన్ ఓరియెంటెడ్ మూవీ చేస్తున్నాడు. అయితే మహానటి ఫేమ్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ఓ భారీ సినిమా చేయబోతున్నాడు. సైంటిఫిక్ థ్రిల్లర్ గా రూపొందనున్న ఈ సినిమా ఎప్పుడు మొదలవుతుందో ఇంకా కన్ఫర్మ్ కాలేదు. ఈ సినిమాలో ప్రభాస్ సూపర్ హీరో పాత్రలో కనిపించనున్నాడని టాక్. ప్రభాస్ సరసన స్టార్ హీరోయిన్ దీపికా పదుకోనె నటించనుంది. సైన్స్ ఫిక్షన్ జానర్ కాబట్టి ఈ సినిమాను గ్రాఫికల్ విసువల్ వండర్ గా రూపొందించాలని ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ప్రస్తుతం భారీ లెవల్లో తెరకెక్కనున్న ఈ సినిమా గురించి రోజు ఏదొక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంది. తాజాగా ఈ సినిమాకు నూతన నటినటులు కావాలని డైరెక్టర్ నాగ్ అశ్విన్ ప్రకటించాడు. అయితే ఈ సినిమాకోసం మార్షల్ ఆర్ట్స్ జిమ్నాస్టిక్స్ తెలిసినవారు కావాలని తెలిపాడు. జిమ్నాస్టిక్స్ డాన్స్ తెలిసిన 9-14 ఏళ్లలోపు గర్ల్స్ మార్షల్ ఆర్ట్స్ తెలిసిన పురుషులు 20-35 ఏళ్ల మధ్య ఉండాలని అన్నాడు. అయితే మొత్తానికి జిమ్నాస్టిక్స్ మార్షల్ ఆర్ట్స్ తెలిసిన వారికే ప్రాధాన్యత ఉంటుందట. ఇక ఈ సినిమాలో లెజెండరి యాక్టర్ అమితాబ్ బచ్చన్ నటించనున్నట్లు తెలిసిందే. ప్రస్తుతం ప్రభాస్ సినిమాలో అమితాబ్ బచ్చన్ నటిస్తున్నారు అనే విషయం తెలియగానే ఈ సినిమా పై అంచనాలు తారాస్థాయిని చేరుకున్నాయి. ఈ సినిమాను వైజయంతి బ్యానర్ పై నిర్మించనుంది. ఇంటర్నేషనల్ స్థాయిలో ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషల్లో సినిమాను విడుదల చేయనున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ నెల 26న ఏదొక అప్డేట్ మాత్రం రానుంది.

## రష్మీ సొగసులు ఛమకు ఛమకులు



అందం విషయంలో అమ్మాయిలు బ్రహ్మదేవుడితో గట్టిగానే వాదించి ఉంటారు. వాళ్ల అందం చూసి ఆయన కూడా కాస్త మెత్తబడే ఉంటాడు. వాళ్ల పంతం తట్టుకోలేక అడిగినంత అందాన్ని సొంతం చేసి ఉంటాడు. అందాల రష్మీని చూస్తే ఇదంతా నిజమేననిపిస్తోంది. అసలే ఈ అమ్మాయికి కాస్త దూకుడు ఎక్కువ .. అందువలన ఆయన కంగారుపడిపోయి కొన్ని గ్రాముల గ్లామర్ ఎక్కువగానే కలిపి ఉంటాడు. అలా ఆమె మరిన్ని నగిషీలు పొందిన విషయం ఆమె మేని మెరుపులు .. విరుపులు చూస్తుంటేనే అర్థమవుతోంది. సోషల్ మీడియాలో రష్మీ చాలా యాక్టివ్ గా ఉంటుంది. తన లేటెస్ట్ ఫోటోలను ఇన్ స్టాలో పోస్ట్ చేస్తూ అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతూ ఉంటుంది. తాజాగా ఆమె నీలిరంగు చీర .. బ్లాక్ కలర్ బ్లౌజ్ ధరించిన ఫోటోలను పోస్ట్ చేసింది. అజంతా గుహల్లో కనిపించని శిల్పంలా .. అమర శిల్పి జక్కన్న చేతికి చిక్కని శిల్పంలా కొన్ని పోజులు కూడా ఇచ్చింది. పట్టును కరిగించి పోతపోసినట్టుగా కనిపించే మేనిఛాయతో కుర్రాళ్ల మతులు గతులు తప్పేలా చేస్తోంది. నీలి నెమలి మాదిరిగా నడుస్తూ వేల వయ్యారాలు ఒలకబోస్తోంది. కళ్లు కావు అవి కత్తెరలు .. చూపులు కావు అవి చురకత్తులు అన్నట్టుగా అవి కుర్రాళ్ల చిలిపితనంపై చురుక్కున దిగుతున్నాయి. వాళ్ల కలలు .. ఊహలన్నీ ఏకమై కాగుతున్నాయి. ఆమె నీడను టచ్ చేసినా చాలు అనే దిశగా వాళ్ల పడుచు మనసులన్నీ పరిగెడుతూ ఉన్నాయి. ఇలా ఫొటోలతో పొద్దు పుచ్చుకుం డా అనసూయ మాదిరిగా వెండితెరపై సందడి చేయమని అడుగుతున్నారు. ఇప్పటికే చాలా గ్యాప్ తీసేసుకున్నావ్ అంటూ అలుగుతున్నారు.

## రామ్ చరణ్‌పై క్రష్ ఉందన్న కుర్ర బ్యూటీ..!



మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ సరసన ఉప్పెన చిత్రంలో నటించింది కన్నడ బ్యూటీ కృతి శెట్టి. తొలి ప్రయత్నమే కుర్రకారును వలపు దోపిడీతో కట్టిపడేసింది. కృతి అంటే బోయ్స్ లో విపరీతమైన క్రేజు నెలకొంది. డెబ్యూ మూవీ ఇంకా రిలీజ్ కాక ముందే అంతటి ఫాలోయింగ్ ఇటీవల వేరొక బ్యూటీకి లేనేలేదేమో! అన్నట్టు ఈ అమ్మడి క్రష్ ఎవరిపై..? ఎవరి సరసన అవకాశం వస్తే నటించాలనుంది? అంటూ ప్రశ్నిస్తే నిర్మొహమాటంగా మనసులో ఉన్న మాటల్ని చెప్పేసింది. క్రష్ ఎవరిపై ఉంది?అంటే.. రామ్ చరణ్ పై అని ఠకీమని చెప్పేసింది. అలాగే రామ్ చరణ్ సరసన నటించాలనుందన్న ఆసక్తిని దాచుకోలేదు ఈ బ్యూటీ. గొప్ప నటుడు వైష్ణవ్ తేజ్ అయితే అందమైన హీరో మహేష్ బాబు అంటూ మనసులో మాట చెప్పింది. వైష్ణవ్ తేజ్ ని మూడు మాటలలో చెబుతూ...అతను మధురమైనవాడని చాలా ప్రశాంతంగా ఉండే గొప్ప నటుడు అని పొగిడేసింది. మంచి నటిగా లేదా ధనవంతురాలైన నటి అవుతారా? అని ప్రశ్నిస్తే.. మంచి నటి అవుతానని కృతి అంది.

## కోలకళ్ల కుర్రది నీలిరంగు చీర కడితే..!



వెండిమబ్బులు నీలాకాశాన్ని కప్పుకోవడం .. మంచుకొండలు నీలి సముద్రాన్ని చీరలా చుట్టుకోవడం ఎప్పుడైనా చూశారా? పోనీ నీలి రెక్కల హంసనుగానీ .. తెల్ల రెక్కల నెమలినిగాని చూశారా? ఎక్కడా కనిపించలేదా? ఇలాంటి అందాలు అరుదుగా మాత్రమే కనిపిస్తూ ఉంటాయి .. అవి చూడటం మిస్ అవుతామనే ఉద్దేశంతోనే ఆ అందాలన్నింటినీ కలుపుకుని అనూ ఇమ్మాన్యుయేల్ లాంటి అమ్మాయిలు ఇలపైకి ఇలా దిగిపోతుంటారు .. వాలు కళ్లతో వాలిపోతుంటారు. పడుచు గుండెలను పాలకుండలుగా చేసుకుని అందులో పంచదారలా కలిసిపోతుంటారు. అనూ ఇమ్మాన్యుయేల్ ఈ మధ్య సోషల్ మీడియాలో చురుగ్గానే ఉంటుంది. అడిగి తెలుసుకోవడం మొహమాటమైతే చూసి నేర్చుకోమని సెలవిచ్చారు పెద్దలు. ప్రస్తుతం ఈ విషయంలో ఈ సుందరి అదే కాన్సెప్టను ఫాలో అవుతున్నట్టుగా ఉంది. ఒక్కో బ్యూటిఫుల్ లుక్ ను ఇన్ స్టాలో వదులుతూ గ్యాపు ఇవ్వకుండా కుర్రాళ్లను ల్యాపు టాపుల ముందు కూర్చుండబెట్టేస్తోంది. తాజాగా ఆమె బ్లూ కలర్ శారీలో దిగిన ఫొటోలు వదిలింది. ఆ అందాల ఘాటుకు .. ఆ చూపుల స్వీటుకు షుగర్లు .. బీపీలు పెరిగిపోతున్నాయి. అనూ ఇమ్మాన్యుయేల్ తొలి సినిమాతోనే ఆకట్టుకుంది. ఆ తరువాత అవకాశాలను కూడా బాగానే అందుకుంది. అయితే ఆశించినస్థాయిలో విజయాలు దక్కలేదు. దాంతో అవకాశాలు తగ్గుతూ వచ్చాయి. అయినా తన గ్లామర్ పై తనకి గల నమ్మకంతో గట్టిగానే నిలదొక్కుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల చేసిన 'అల్లుడు అదుర్స్' కలిసిరాకపోయినా 'మహాసముద్రం'తో మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో ఉంది. ఇన్ స్టాలో ఆమె తాజాగా పోస్ట్ చేసిన ఫొటోలోని లుక్ చూస్తుంటే 'అవకాశాలు తగ్గాయేమోగానీ .. అందాలు తగ్గలేదు బాసూ' అన్నట్టుగా లేదూ!

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed at Unyted Publications from H.no.# 5+-61-3,Rajendra Nagar,Seethampeta,Visakhapatnam-16,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16, Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com